UDYAM-TS-02-0308842 www.prathighatana.com

# ప్రతిఘటన

తెలుగు దిన పత్రిక
జనం కోసం..

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 34 | పేజీలు : 8 | ఆదివారం 1 మార్చి 2026 | వెల : 4/-

## దుబాయిలో అలర్ట్.. బుర్జ్ ఖలీఫా ఖాళీ



- ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ క్షిపణి దాడులు
- అమెరికా 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ప్రతిదాడి
- ఎయిర్ ఇండియా, ఇండిగో సర్వీసులు రద్దు..
- భారతీయులకు అడ్వైజరీ

## ఇరాన్‌పై 'ఇజ్రాయెల్-అమెరికా'
# భీకర యుద్ధం

- మినాబ్ నగరంలో బాలికల స్కూల్‌పై దాడి
- 40 మంది విద్యార్థినుల దుర్మరణం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- 45 మందికి పైగా తీవ్ర గాయాలు
- దుబాయ్ విమానాశ్రయాల కార్యకలాపాలు నిలిపివేత
- అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించారంటూ రష్యా తీవ్ర ఆగ్రహం
- విద్యార్థినుల ప్రాణాలను బలిగొన్న క్షిపణి దాడులు





ప్రతిఘటన, నేషనల్ బ్యూరో

పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు అంటుకున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దళాలు సంయుక్తంగా దాడులు ప్రారంభించాయి. హార్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లోని మినాబ్ నగరంలో ఉన్న ఒక బాలికల పాఠశాల లక్ష్యంగా జరిగిన దాడిలో 40 మంది విద్యార్థినులు మరణించడం ప్రపంచ వ్యాప్తంగా కలకలం రేపింది. దాడి సమయంలో పాఠశాలలో సుమారు 170 మంది విద్యార్థినులు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో మరో 45 మంది తీవ్రంగా గాయపడగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. ఇరాన్ పారామిలిటరీ దళమైన 'ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్' స్థావరం ఈ ప్రాంతంలో ఉండటమే దాడులకు ప్రధాన కారణమని భావిస్తున్నారు. ఈ దారుణ మారణకాండతో ఇరాన్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి.

**రాజకీయ విమర్శలు - అంతర్జాతీయ స్పందన**

ఈ దాడులపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ - మిగతా3లో



- సూర్యశ్రీ ఫైర్ వర్క్స్‌లో పేలుడు
- 23 మంది సజీవదహనం
- 5 కిలోమీటర్ల మేర వినిపించిన శబ్దం
- చెల్లాచెదురైన శరీర భాగాలు
- మృతుల్లో అత్యధికులు మహిళలే
- పరిమితికి మించి నిల్వ ఉంచడమే ప్రమాదానికి కారణమా?
- కొనసాగుతున్న సహాయక చర్యలు

# మృత్యు విస్ఫోటనం

ప్రతిఘటన, ఏపీ బ్యూరో

తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట మండలంలోని వేట్లపాలెం గ్రామం శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా దద్దరిల్లింది. గోదావరి కెనాల్ పక్కనే ఉన్న 'సూర్యశ్రీ ఫైర్ వర్క్స్' బాణాసంచా తయారీ కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో సంభవించిన భారీ పేలుడు 23 మంది నిరుపేద కార్మికుల ప్రాణాలను బలితీసుకుంది. పేలుడు ధాటికి భారీ ఎత్తున మంటలు ఎగసిపడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. ప్రమాద సమయంలో లోపల మొత్తం 34 మంది పనిచేస్తుండగా, మంటల - మిగతా3లో



## ఇరాన్ ప్రతీకారేచ్ఛ.. ఇజ్రాయెల్‌లో సైరన్ల మోత



- ఇజ్రాయెల్ వైపు దూసుకొచ్చిన ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు
- ఖమేనీ నివాసం సహా 30 ప్రాంతాలే లక్ష్యంగా ఇజ్రాయెల్-అమెరికా దాడులు
- గగనతలంలోనే క్షిపణులను అడ్డుకుంటున్న ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలు
- తొలి విడత దాడి మాత్రమేనని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ హెచ్చరిక
- ఎర్రబడిన 'హోమ్ ఫ్రంట్ కమాండ్ యాప్'

## మక్కా యాత్ర ప్రమాద బాధితులకు 'రేవంత్' చేయూత



- బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- గాయపడిన వారికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేత
- గతేడాది నవంబర్ 17న జరిగిన ఘోర ప్రమాదంపై ప్రభుత్వం స్పందన
- సజీవ దహనమైన 44 మంది హైదరాబాద్ వాసులు

ప్రతిఘటన, హైదరాబాద్

మక్కా యాత్రలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందిన వారికి రూ.3లక్షల చొప్పున సాయం అందజేశారు. పవిత్ర యాత్రకు - మిగతా3లో

## అబుదాబి హిందూ దేవాలయం మూసివేత



- ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో యూఏఈలో హై అలర్ట్
- భక్తుల భద్రత దృష్ట్యా బీఏపీఎస్ ఆలయం తాత్కాలికంగా బంద్
- దుబాయ్, రియాద్ నగరాల్లో భారీ పేలుడు శబ్దాలు
- ఆకాశంలోనే మిసైళ్లను అడ్డుకున్న రక్షణ దళాలు
- జాతీయ భద్రతా సంస్థల సూచనలతో గల్ఫ్ దేశాల్లో అత్యవసర పరిస్థితి

2లో

## పోస్ట్ మార్టం రిపోర్ట్‌కు రూ.2లక్షల డిమాండ్

- సీఎంవో నుంచి ఫోన్ చేయించిన లంచం వైపు మొగ్గు
- నాలుగు నెలలుగా డబ్బుల కోసం వేధింపులు
- రూ.35వేలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ హోంగార్డు



- కీసర పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ నగేష్

## శారదాపీఠం భూమి కేటాయింపు రద్దు

- రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం
- కోకాపేటలో గత ప్రభుత్వం ఇచ్చిన 2 ఎకరాల భూమి వెనక్కి
- జలమండలికి భూమిని కేటాయిస్తూ జీవో జారీ
- నిబంధనల ఉల్లంఘనపై అధికారుల ఆరా
- 99 రోజుల కార్యాచరణపై సచివాలయంలో సీఎం సమీక్ష



ప్రతిఘటన, హైదరాబాద్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, రానున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పారదర్శక పాలనే లక్ష్యంగా ప్రతి శాఖ నుంచి పూర్తిస్థాయి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ నిర్ణయాలపై సమీక్ష చేస్తూ, భూ కేటాయింపుల్లో జరిగిన లోపాలను సరిదిద్దే పనిలో పడ్డారు. ముఖ్యంగా విలువైన ప్రభుత్వ భూములను నామమాత్రపు ధరలకే కేటాయించిన అంశాలపై సీఎం ఆరా తీశారు. విశాఖ శ్రీ శారదాపీఠానికి గత కేసీఆర్ ప్రభుత్వం 2019లో కోకాపేటలో కేటాయించిన సుమారు రెండు ఎకరాల భూమిని - మిగతా3లో

## రైతు రిజిస్ట్రీలో తెలంగాణ నంబర్ వన్

- 39,77,791 మందికిగాను 43,59,371 మంది రైతుల నమోదు
- 110 శాతం లక్ష్యాన్నిసాధించిన స్టేట్
- వ్యవసాయరంగంలో పారదర్శకతను పెంపొందించనున్న రైతురిజిస్ట్రీ
- అధికారులపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రశంసలు

ప్రతిఘటన, హైదరాబాద్

రైతురిజిస్ట్రీ నమోదుప్రక్రియలో 110% సాధనతో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా అవతరించింది. డిజిటల్ వ్యవసాయ కార్యక్రమాల కింద రైతురిజిస్ ట్రీ నమోదు ప్రక్రియలో తెలంగాణ రాష్ట్రం 100% నమోదు పూర్తి చేసి, భారతప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని మించి సాధించి దేశంలో అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా నిలిచింది.

**ప్రణాళికా బద్ధమైన చర్యలు**

తెలంగాణకు నిర్దేశిత లక్ష్యమైన 39,77,791 మంది రైతుల స్థానంలో 43,59,371 మందిరైతులను నమోదుచేసి, - మిగతా3లో



## ఇంటర్ పరీక్షా కేంద్రంలోని టాయ్‌లెట్‌లో..


- మృత శిశువుకు జన్మనిచ్చిన ఫస్ట్ ఇయర్ విద్యార్థిని
- ఇంగ్లిష్ పరీక్ష రాయటానికి వచ్చిన 16 ఏళ్ల బాలిక
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఈ ఘటన



# ఇరాన్ ప్రతీకారేచ్ఛ.. ఇజ్రాయెల్‌లో సైరన్ల మోత

ప్రతిఘటన, నేషనల్ బ్యూరో

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో జరిపిన దాడుల తర్వాత పశ్చిమాసియాలో పరిస్థితులు యుద్ధ క్షేత్రాన్ని తలపిస్తున్నాయి. ఇరాన్ ప్రయోగించిన వందలాది క్షిపణులు ఇజ్రాయెల్ గగనతలంపైకి దూసుకురావడంతో ఆ దేశం అంతటా హై అలర్ట్ ప్రకటించారు. ఈ క్రమంలో ఇజ్రాయెల్ పౌరుల మొబైల్స్‌లోని 'హోమ్ ఫ్రంట్ కమాండ్ యాప్' ఒక్కసారిగా ఎరుపు రంగులోకి మారిపోయింది. క్షిపణులు వచ్చే దిశను బట్టి ఈ యాప్ నిరంతరం హెచ్చరికలు జారీ చేస్తుండటంతో పౌరులు బాంబు షెల్టర్లలోకి పరుగులు తీశారు. ముఖ్యంగా ఉత్తర ఇజ్రాయెల్ ప్రాంతంలో సైరన్ల మోత దద్దరిల్లిపోతోంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ తమ ప్రతీకార దాడులను ప్రారంభించామని, ఇవి ఇంకా కొనసాగుతాయని స్పష్టం చేయడంతో ఆందోళన మరింత పెరిగింది.




### ఖమేనీ నివాసమే లక్ష్యంగా భారీ బాంబు దాడి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నేతృత్వంలో జరిగిన ఈ దాడులు అత్యంత వ్యూహాత్మకంగా సాగాయి. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కార్యాలయం, నివాసంతో పాటు అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. మొత్తం 30 కీలక ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించగా, నిఘా ప్రధాన కార్యాలయాలు కూడా ధ్వంసమయ్యాయి. అయితే, దాడులకు ముందే ఖమేనీని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు సమాచారం అందుతోంది. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని అమెరికా ప్రకటించగా, ఇది చట్టవిరుద్ధమైన దురాక్రమణ అని ఇరాన్ విదేశాంగ శాఖ మండిపడింది.

### గగనతలంలో క్షిపణుల పోరు

ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను అడ్డుకోవడానికి ఇజ్రాయెల్ తన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను రంగంలోకి దించింది. ఆకాశంలోనే క్షిపణులు ఢీకొంటుండటంతో భారీ శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇజ్రాయెల్-అమెరికా దళాలు సంయుక్తంగా తమ గగనతలాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాయి. మరోవైపు, ఈ యుద్ధ ప్రభావం వల్ల మధ్యప్రాచ్యంలోని 11 దేశాలు తమ విమానయాన సేవలను నిలిపివేశాయి. ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య మొదలైన ఈ పరస్పర దాడులు ప్రపంచ శాంతికి ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. దౌత్య చర్చలు విఫలమవడమే ఈ భారీ సైనిక చర్యలకు దారితీసినట్లు తెలుస్తోంది.

# మృత్యు విస్ఫోటనం

-మొదటిపేజీ తరువాయి

తీవ్రతకు 21 మంది అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. మిగిలిన 13 మంది కార్మికులు తీవ్ర గాయాలపాలవగా, వారిలో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో ఏడుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. మృతుల్లో ఎక్కువ మంది మహిళా కార్మికులే ఉండటం స్థానికులను కలచివేసింది.

### యుద్ధక్షేత్రాన్ని తలపించిన ఘటనాస్థలి

ఈ విస్ఫోటనం ఎంత శక్తివంతంగా ఉందంటే, దాని శబ్ద తీవ్రతకు సుమారు 5 కిలోమీటర్ల మేర భూమి కంపించినట్లు స్థానికులు చెబుతున్నారు. పక్కనే ఉన్న గ్రామంలోని ఒక ప్రైవేట్ పాఠశాల భవనం స్లాబ్‌కు సైతం పగుళ్లు వచ్చాయి. ఘటనాస్థలికి చేరుకున్న సహాయక బృందాలకు అక్కడ భీభత్సమైన దృశ్యాలు కనిపించాయి. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉండగా, కొన్ని మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్ల సాయంతో గంటల తరబడి పోరాడి మంటలను అదుపులోకి తెచ్చారు. సామర్థ్యానికి మించి నిల్వ చేసిన మందుగుండు సామాగ్ర వల్లే ఈ ఘోరం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



### ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం


విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై తక్షణమే స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించడంతో పాటు, హోం మంత్రి అనితను వెంటనే ఘటనాస్థలికి వెళ్లాలని సూచించారు. సీఎం ఆదేశాల మేరకు హోం మంత్రి అనిత హుటాహుటిన వేట్లపాలెం బయలుదేరారు. ఇప్పటికే పోలీసులు 11 మంది మృతుల వివరాలను సేకరించారు. మృతుల్లో అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, ధనరాజు, సత్యవేణి వంటి వారు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతుండగా, బాధిత కుటుంబాల్లో పెను విషాదం నెలకొంది.

## నాన్న ఉంటే బాగుండు అమ్మ..

నాన్న లేనందుకే నాకు ఇన్ని కష్టాలు

సూసైడ్ లెటర్ రాసి మహిళ కానిస్టేబుల్ ఆత్మహత్య

ధారూర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న దివ్య



ప్రతిఘటన, హైదరాబాద్

వికారాబాద్ పట్టణం గంగారంలో దివ్య అనే మహిళ కానిస్టేబుల్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ధారూర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న దివ్య అనే కానిస్టేబుల్ సూసైడ్ లెటర్ రాసి ప్రాణాలు తీసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దివ్య ఆత్మహత్యకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఎవరైనా వేధించారా అనే కోణంలో బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆత్మహత్యకు ముందు దివ్య రాసిన లెటర్ గుర్తించారు. ఆ లెటర్ లో "నా చావుకు ఎవరు కారణం కాదు. మెంటల్ స్ట్రెస్ తట్టుకోలేకనే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు రాసుకొచ్చింది. నాన్న ఉంటే బాగుండు అమ్మ.. నాన్న లేనందుకే నాకు ఇన్ని కష్టాలు. అమ్మ నేను నీకు భారం కాకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాను. నన్ను క్షమించు అమ్మ" అంటూ దివ్య రాసిన లెటర్ కన్నీళ్లు పెట్టిస్తోంది. కష్టపడి చదివి ఉద్యోగం సాధించి అర్థాంతరంగా తనువు చాలించడంతో మహిళా కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. 2020 బ్యాచ్ కు చెందిన కానిస్టేబుల్ దివ్య.. హైదరాబాద్ అంబర్ పేట్ లో కానిస్టేబుల్ శిక్షణ పొందింది. ఆరేళ్ల క్రితం తండ్రి మృతి చెందారు. దివ్య తల్లి జగదేవి. పోలీస్ హోంగార్డుగా పని చేసిన తండ్రి బాస్వరాజ్. ఎస్సై కావడానికి ఆసక్తి చూపిన దివ్య. బసవరాజ్ కు ముగ్గురు కూతుర్లు కాగా దివ్య మూడో కూతురు. దివ్య వికారాబాద్ జిల్లా ధారూర్ పోలీస్ స్టేషన్ లో ఐదు సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నది. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర కన్నీరు మున్నీరు అవుతున్నారు దివ్య బ్యాచ్ కు చెందిన మహిళా కానిస్టేబుళ్లు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వికారాబాద్ సీఐ రఘు కుమార్ తెలిపారు.

## సాయి సూర్య డెవలపర్స్‌కు ఈడీ షాక్

మోసపూరిత రియల్ ఎస్టేట్ స్కీమ్‌ల ద్వారా డిపాజిటర్లకు కుచ్చుటోపీ

రూ.14.63 కోట్ల ఆస్తులు జప్తు!

ఒకే ప్లాట్‌ను పలువురికి విక్రయించి కోట్లలో వసూళ్లు

మనీలాండరింగ్ చట్టం కింద ఆస్తులను అటాచ్ చేసిన ఈడీ

నిధుల మళ్ళింపు కోసం కుటుంబ సభ్యుల పేరుతో బినామీ ఖాతాల వినియోగం

పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన కేంద్ర సంస్థ

రియల్ మోసం.. నమ్మించి వంచించిన వైనం




**ప్రతిఘటన, హైదరాబాద్ :** ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సాయి సూర్య డెవలపర్స్ పేరుతో జరిగిన భారీ భూ కుంభకోణంపై ఈడీ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తామని, రిజిస్ట్రేషన్లు చేస్తామని నమ్మబలికి అమాయక పెట్టుబడిదారుల నుంచి ఈ సంస్థ కోట్లాది రూపాయలు వసూలు చేసింది. అయితే, విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఒకే ప్లాట్‌ను వేర్వేరు వ్యక్తులకు విక్రయించి, పత్రాలను సృష్టించి మోసానికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. బాధితుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని ప్రాజెక్టుల అభివృద్ధికి వాడకుండా, వ్యక్తిగత లాభాల కోసం మళ్లించినట్లు నిర్ధారణ కావడంతో రూ.14.63 కోట్ల విలువైన స్థిరాస్తులను ఈడీ ప్రాథమికంగా అటాచ్ చేసింది.

### బ్యాంక్ ఖాతాల్లో లేయరింగ్.. నిధుల మళ్ళింపు

వసూలు చేసిన అక్రమ సొమ్మును దాచేందుకు సాయి సూర్య డెవలపర్స్ యాజమాన్యం పక్కా ప్లాన్ వేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నగదు, చెక్కులు, బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ల ద్వారా సేకరించిన నిధులను నేరుగా సంస్థ ఖాతాల్లో ఉంచకుండా, పలు బ్యాంక్ ఖాతాల ద్వారా 'లేయరింగ్' చేసినట్లు ఈడీ గుర్తించింది. నిధుల మూలాన్ని కప్పిపుచ్చేందుకు నిందితులు తమ కుటుంబ సభ్యులు, ఇతర అనుబంధ సంస్థల ఖాతాల్లోకి నిరంతరం లావాదేవీలు జరిపారు. తద్వారా బాధితులకు భారీ ఆర్థిక నష్టాన్ని మిగిల్చి, నిందితులు మాత్రం భారీగా లాభపడ్డారు. తెలంగాణ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తును వేగవంతం చేసింది.

### తీగ లాగితే డొంక కదిలింది

సాయి సూర్య డెవలపర్స్ సంస్థ కేవలం ఒక్క ప్రాజెక్టుకే పరిమితం కాకుండా, 'గ్రీన్ మెడోస్' వంటి పలు వెంచర్ల పేరుతో మోసాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ సంస్థ ప్రమోటర్ సతీష్ చంద్ర గుప్తాతో పాటు సురానా గ్రూప్‌కు చెందిన నరేంద్ర సురానాపై కూడా ఆరోపణలు రావడంతో గతంలోనే సోదాలు జరిగాయి. ఈ సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించిన ప్రముఖులకు అందిన చెల్లింపుల విషయంలోనూ ఈడీ ఆరా తీసినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేసి, ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని తప్పుదోవ పట్టించి చేసిన ఈ మోసంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో విచారణ కొనసాగుతోంది. జప్తు చేసిన ఆస్తుల్లో ప్లాట్లు, సాగు భూములు ఉన్నట్లు తెలుస్తోంది.

## దుబాయిలో అలర్ట్.. బుర్జ్ ఖలీఫా ఖాళీ



ప్రతిఘటన, నేషనల్ బ్యూరో

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకోవడంతో పశ్చిమాసియా ప్రాంతంలో పెను అలజడి రేగింది. ఈ పరిణామాల నేపథ్యంలో దుబాయ్‌లోని ప్రపంచ ప్రఖ్యాత బుర్జ్ ఖలీఫా భవనాన్ని అధికారులు ముందస్తు జాగ్రత్తగా ఖాళీ చేయించారు. గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ క్షిపణి దాడులు చేయడంతో దుబాయ్ నగరం అంతటా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. దీంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారని నివేదికలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా ఖతార్, కువైట్, యూఏఈ , బహ్రెయిన్‌లోని అమెరికా బేస్‌లపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ క్షిపణులను ప్రయోగించినట్లు ప్రకటించింది. అబుదాబిపై జరిగిన ఈ దాడుల్లో ఒక ఆసియా జాతీయుడు మరణించినట్లు యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. మరోవైపు, ఇరాన్‌లోని కీలక సైనిక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" పేరుతో భారీ ప్రతిదాడిని ప్రారంభించింది. ఈ యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాలు తమ గగనతలాన్ని నిరవధికంగా మూసివేయడంతో అంతర్జాతీయ విమానయాన రంగం స్తంభించిపోయింది. ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి భారతీయ విమానయాన సంస్థలు తమ సర్వీసులను రద్దు చేయగా, అబుదాబిలోని భారత రాయబార కార్యాలయం అక్కడ ఉన్న భారతీయుల కోసం ప్రత్యేక అడ్వైజరీని జారీ చేసింది. పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నందున అనవసర ప్రయాణాలు మానుకోవాలని, స్థానిక అధికారులు , రాయబార కార్యాలయం ఇచ్చే సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని భారతీయ పౌరులకు సూచించడమైనది. ఈ యుద్ధ పరిణామాలు పశ్చిమాసియాలో పెను రాజకీయ, భద్రతా సంక్షోభానికి దారితీస్తున్నాయి.

## వేట్లపాలెం మృతుల కుటుంబాలకు రూ.20లక్షలు : సీఎం చంద్రబాబు

**ప్రతిఘటన, ఏపీ బ్యూరో :** వేట్లపాలెం బాణ సంచా తయారీ కేంద్రం పేలుడు దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వాళ్ల కుటుంబాలకు రూ.20లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు ఆంధ్రప్రదేశ్? ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శనివారం సాయంత్రం ఆయన కాకినాడ జిల్లా కేంద్రం చేరుకున్నారు. జీజీహెచ్?లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వాళ్ల కుటుంబసభ్యులను ఓదార్చారు. అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాల్లోని పిల్లల చదువును బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. గాయపడినవాళ్లకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం మీడియాతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. బాధితుల్లో 9 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. బాణా సంచా తయారీ కేంద్రాల పర్యవేక్షణలో విఫలమయ్యారని డీఎస్పీ, జిల్లా ఫైర్? ఆఫీసర్?, జిల్లా లేబర్? ఆఫీసర్?, ఆర్డీవోలను సస్పెండ్? చేస్తున్నట్లు ప్రకటించారు. బాణా సంచా తయారీ కేంద్రం ఘటనకు బాధ్యులైన అధికారులను సస్పెండ్? చేస్తున్నట్లు ప్రకటించారు. దుర్ఘటనకు కారణమైన నిర్వాహకుల ఆస్తులు జప్తు చేసి, బాధిత కుటుంబాలకు అందజేస్తామని ప్రకటించారు. అనుమతి లేకుండా బాణ సంచా తయారుచేసేవాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దుర్ఘటనపై దర్యాప్తు కోసం కమిటీ ఏర్పాటుచేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు.

## పోస్ట్ మార్టం రిపోర్ట్‌కు రూ.2లక్షల డిమాండ్

**ప్రతిఘటన, హైదరాబాద్ :** మేడ్చల్ జిల్లాలోని కీసర పోలీస్ స్టేషన్‌లో వెలుగుచూసిన అవినీతి ఉదంతం తీవ్ర సంచలనం సృష్టించింది. ఒక సాధారణ పోస్ట్ మార్టం రిపోర్ట్ కోసం సామాన్యులను ఏ విధంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారో ఈ ఘటన అద్దం పడుతోంది. కీసర పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ నగేష్, తోటకూర మహేష్ అనే వ్యక్తి మృతికి సంబంధించిన పోస్ట్ మార్టం రిపోర్ట్ ఇప్పించేందుకు లంచం డిమాండ్ చేశాడు. గాంధీ ఆసుపత్రి డాక్టర్ సందీప్ పేరును వాడుకుంటూ.. రిపోర్ట్ కావాలంటే మొదట రూ. 2 లక్షల ఇవ్వాలని మృతుడి మేనల్లుడు శరత్‌ను వేధించాడు. నెలలు గడుస్తున్నా రిపోర్ట్ రాకపోవడంతో.. బాధితుడు అనేక మార్లు బ్రతిమిలాడగా చివరకు 40 వేల రూపాయలకు ఒప్పందం కుదిరింది. మహేష్ చనిపోయి నాలుగు నెలలు గడుస్తున్నా రిపోర్ట్ చేతికి అందకపోవడంతో బాధితుడు శరత్ అన్ని మార్గాలను అన్వేషించాడు. చివరకు ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ నుండి ఫోన్ చేయించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఉన్న హోంగార్డ్ నగేష్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. పైస్థాయి ఒత్తిళ్లు కూడా పని చేయకపోవడంతో విసిగిపోయిన బాధితుడు చివరకు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. శరత్ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో నిఘా పెట్టారు. మొదటి విడతగా ఇప్పటికే రూ.5 వేలు తీసుకున్న నగేష్ రెండవ విడతగా మిగిలిన రూ. 35 వేల తీసుకుంటుండగా అధికారులు మెరుపు దాడి చేశారు. డబ్బు తీసుకుంటున్న సమయంలోనే నగేష్‌ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం నగేష్‌ను అదుపులోకి తీసుకుని.. ఈ వ్యవహారంలో డాక్టర్ల పాత్ర లేదా ఇతర పోలీసుల ప్రమేయం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. సామాన్యులకు అండగా ఉండాల్సిన పోలీసు వ్యవస్థలో ఇలాంటి ఘటనలు జరగడం విచారకరం. బాధితుడు ధైర్యంగా ఏసీబీని ఆశ్రయించడం వల్లనే ఈ అవినీతి తిమింగలం పట్టుబడింది.

## వేట్లపాలెం దుర్ఘటన కలచివేసింది : ప్రధాని మోదీ



**ప్రతిఘటన, ఏపీ బ్యూరో :** ఆంధ్రప్రదేశ్?లోని కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం జరిగిన ఈ ఘోర ప్రమాదంలో 20 మందికిపైగా కార్మికులు దుర్మరణం పాలవ్వగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్న ప్రధాని మోదీ.. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ కష్టకాలంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చనిపోయినవాళ్లకు ఒక్కొక్కరికి రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడినవాళ్లు త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
ఆదివారం 1 మార్చి 2026

## ఇరాన్‌పై 'ఇజ్రాయెల్-అమెరికా' భీకర యుద్ధం

-మొదటిపేజీ తరువాయి

అరాఫ్చీ తీవ్రస్థాయిలో స్పందించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలిసి చేస్తున్న ఈ యుద్ధం అక్రమమని ధ్వజమెత్తారు. ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్' నినాదాన్ని 'ఇజ్రాయెల్ ఫస్ట్'గా మార్చేశారని ఎద్దేవా చేశారు. దురాక్రమణదారులకు తమ సాయుధ బలగాలు తగిన గుణపాఠం చెబుతాయని హెచ్చరించారు. మరోవైపు రష్యా ఈ దాడులను తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయెల్, అమెరికాలు అంతర్జాతీయ చట్టాలను తుంగలో తొక్కాయని ఆరోపించింది. ఖతార్, సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాలు సైతం వెంటనే దాడులు ఆపి, దౌత్య చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని డిమాండ్ చేశాయి.

**స్తంభించిన రవాణా వ్యవస్థ.. భారతీయులకు అలర్ట్**

యుద్ధ ఉద్రిక్తతల ప్రభావం గల్ఫ్ దేశాల రవాణాపై తీవ్రంగా పడింది. దుబాయ్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు అల్ మక్తుమ్ విమానాశ్రయాల కార్యకలాపాలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. తదుపరి నోటీసులు ఇచ్చే వరకు విమాన సర్వీసులు అందుబాటులో ఉండవని ప్రకటించారు. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి వల్ల గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలని విదేశాంగ శాఖ సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ఎంబసీ అధికారులతో సంప్రదింపులు జరపాలని కోరింది. ప్రస్తుత పరిస్థితులు మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయేమోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

**ఒకేసారి ఎనిమిది దేశాలపై ఇరాన్ ఎటాక్**

తమపై యుద్ధానికి దిగిన అమెరికాపై ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడి చేసింది. అంతేకాదు.. ఒకేసారి ఏకంగా ఎనిమిది దేశాలపై ఇరాన్ ఎటాక్ చేసింది. ఇజ్రాయెల్, బహ్రెయిన్, కువైట్, సౌదీతోపాటు అబుదాబి, ఖతార్, జోర్డాన్, యూఏఈపై ఇరాన్ దాడి చేసింది. మిస్సైళ్లతో విరుచుకు పడింది. ఇరాన్ దాడులతో టెల్ అవీవ్‌లో సైరన్ల మోత మోగుతోంది. ప్రజలను ఇజ్రాయెల్ అప్రమత్తం చేసింది. దేశవ్యాప్తంగా తక్షణ జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఇజ్రాయెల్‌లో ముందస్తు జాగ్రత్తగా స్కూళ్లు, కార్యాలయాలు మూసివేశారు. ఎయిర్‌స్పేస్ కూడా క్లోజ్ చేశారు. మరోవైపు.. ఇప్పటికే ఇజ్రాయెల్, అమెరికా దాడులపై ఇరాన్ ప్రభుత్వం అత్యంత ఘాటుగా స్పందించింది. తమ దేశ సార్వభౌమాధికారంపై జరిగిన ఈ దాడికి ప్రతిదాడి అదే స్థాయిలో సమాధానం చెబుతామని హెచ్చరించింది. యుద్ధాన్ని మీరు ప్రారంభించి ఉండవచ్చు.. కానీ దీని ముగింపు మాత్రం మా చేతుల్లోనే ఉంటుందని ఇరాన్ సైన్యం అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఘాటు హెచ్చరికలు జారీ చేసింది.

## అబుదాబి హిందూ దేవాలయం మూసివేత

**ప్రతిఘటన, నేషనల్ బ్యూరో:** పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఎగిసిపడుతుండటంతో గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేయడం, ప్రతిగా ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడుతుండటంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో అబుదాబిలోని ప్రతిష్టాత్మక బీఏపీఎస్ హిందూ దేవాలయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ యాజమాన్యం ప్రకటించింది. జాతీయ భద్రతా సంస్థల మార్గదర్శకాల ప్రకారం భక్తుల క్షేమమే తమకు అత్యంత ప్రాధాన్యమని, ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. శాంతి నెలకొనాలని ప్రార్థిస్తూనే, పరిస్థితులు సద్దుమణిగాక దర్శనాలపై తదుపరి సమాచారం ఇస్తామని స్పష్టం చేసింది.

**దుబాయ్ ఆకాశంలో క్షిపణుల విధ్వంసం**

శనివారం తెల్లవారుజామున దుబాయ్ నగరం భారీ పేలుడు శబ్దాలతో దద్దరిల్లింది. ఇరాన్ ప్రయోగించిన మిసైళ్లను యూఏఈ రక్షణ దళాలు గాలిలోనే అడ్డుకోవడంతో ఆకాశంలోనే భారీ విస్ఫోటనాలు సంభవించాయి. ఈ క్రమంలో జరిగిన ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం అందుతోంది. కేవలం దుబాయ్ మాత్రమే కాకుండా సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో కూడా ఇలాంటి పేలుడు శబ్దాలు వినిపించాయని అంతర్జాతీయ వార్తా సంస్థ ఏఎఫ్పీ ధ్రువీకరించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న దృశ్యాలు ప్రజలను మరింత భయాందోళనకు గురిచేస్తున్నాయి. యుద్ధం అంచున ఉన్న ఈ దేశాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని అనిశ్చితి నెలకొంది.

**భారతీయుల్లో ఆందోళన – నిలిచిన విమాన సర్వీసులు**

యుద్ధం తీవ్రత పెరుగుతుండటంతో గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయులు, ముఖ్యంగా తెలుగు ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. క్షిపణి దాడుల ముప్పు పొంచి ఉండటంతో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం తన కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేసింది. విమాన ప్రయాణాలు రద్దు కావడంతో వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లోనే చిక్కుకుపోయారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఈ సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దౌత్య పరమైన చర్చలు విఫలమైతే ఇది పూర్తిస్థాయి యుద్ధంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

## రైతు రిజిస్ట్రీలో తెలంగాణ నంబర్ వన్

-మొదటిపేజీ తరువాయి

110% లక్ష్యాన్నిసాధించింది. రైతురిజిస్ట్రీసృష్టి, రాష్ట్రంప్రదర్శించిన అత్యుత్తమ పనితీరుకు కేంద్రం ప్రత్యేక సహాయం కింద రూ.422.64కోట్లు ప్రోత్సాహకాన్ని మంజూరు చేసింది. వ్యవసాయశాఖమంత్రి తుమ్మలనాగేశ్వరరావు దూరదృష్టి, నాయకత్వం, నిరంతం పర్యవేక్షణలో సాధించగలిగింది. గ్రామస్థాయి వరకు సమన్వయంతో పనులను సమీక్షిస్తూ పురోగతిని నిరంతరం పర్యవేక్షించారు. మిగిలినపట్టాదారులను త్వరితగతిన నమోదు చేయడానికి రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉంది. అర్హులైన రైతులందరినీ పూర్తిస్థాయి లోచేర్చే దిశగాక్షేత్రస్థాయిలోప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రణాళికా బద్ధమైన చర్యలు, సమగ్ర పర్యవేక్షణ క్షేత్రస్థాయి అమలుతో అన్ని జిల్లాల్లో రైతుల నమోదు విజయవంతంగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమం వ్యవసాయసేవల పారదర్శకతను మరింత బలోపేతం చేసింది. సంక్షేమపథకాలుసమయానుకూలంగా, అర్హులైనలబ్ధిదా రులకునేరుగా అందేవి ధంగా డేటా ఆధారితవ్యవసాయపరిపాలనకు ఇదిదోహదపడు తుంది.

**రైతు రిజిస్ట్రీవ్యవసాయరంగంలో..**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయశాఖ సిబ్బందిని, వ్యవసాయ విస్తరణాధికారులు, మండలవ్యవసాయఅధికారులు, క్షేత్రసిబ్బంది, సాంకేతిక బృందాలు, జిల్లాస్థాయి అధికారులను అభినందించారు. నిర్ణీతగడువులోప్రతి అర్హత కలిగిన రైతును చేరుకోవడంలో చూపినకృషి, సమన్వయం, అంకితభావాన్నిప్రశంసించారు. రైతు రిజిస్ట్రీవ్యవసాయరంగంలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు, సంక్షేమ పథకాలు, సేవలను ఆలస్యం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా అందించేందుకు దోహదపడుతుంది. డిజిటల్వేదికలనువినియోగిస్తూరైతుసంక్షేమం, సేవల మెరుగుదల, సుస్థిరవ్యవసాయ అభివృద్ధిదిశగా వ్యవసాయశాఖ, తెలంగాణ ప్రభుత్వం తన నిబద్ధతను మరోసారి స్పష్టం చేసింది.

## ఇంటర్ పరీక్షా కేంద్రంలోని టాయ్‌లెట్‌లో..

ప్రతిఘటన, ఖమ్మం : ఇంటర్ పరీక్షా కేంద్రంలోని టాయ్‌లెట్‌లో మృత శిశువుకు మైనర్ బాలిక జన్మనిచ్చిన ఘటన కలకలం రేపింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఈ ఘటన చోటుచేసుకుంది. పాల్వంచలోని ఓ కేంద్రానికి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న 16 ఏళ్ల బాలిక ఇంగ్లిష్ పరీక్ష రాయటానికి వచ్చింది. పరీక్ష ప్రారంభమైన తర్వాత ఇన్విజిలేటర్ అనుమతితో టాయ్‌లెట్‌కు వెళ్లింది. ఎంతసేపటికీ రాకపోవటంతో మరుగు దొడ్డి వైపు వెళ్లి చూశారు. బాలిక నెమ్మదిగా నడుచుకుంటూ బయటికి రావడంతో ఎగ్జామ్ సెంటర్ సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు. బాలిక వివరాలు ఆరా తీయటంతో అసలు విషయం బయటపడింది. సిబ్బంది వెళ్లిచూడగా.. బేసిన్‌లో మృతశిశువు పడి ఉండడంతో షాక్ కు గురయ్యారు. అయితే పరువు పోతుందనే భయంతోనే ఎవరికీ అనుమానం రాకుండా శిశువును బాత్రూం బేసిన్‌లో కుక్కినట్లు బాలిక తెలిపినట్లు సిబ్బంది తెలిపారు.

## ఖమ్మంలో కాంగ్రెస్ రాక్షస క్రీడ.. వెలుగుమట్ల కూల్చివేతలపై ఈటల ఫైర్



ప్రతిఘటన, ఖమ్మం : ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో నిరుపేదల ఇండ్లను నేలమట్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి వెలుగుమట్లలోని భూదాన్ బాధితులను పరామర్శించి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో పదికి తొమ్మిది స్థానాలు కట్టబెట్టిన ఖమ్మం ప్రజల పట్ల అధికార పక్షం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ముగ్గురు కీలక మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ జిల్లాలో రక్షణ లేకుండా పోవడం శోచనీయమన్నారు.రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నదీ ప్రక్షాళన సుందరీకరణ పేరుతో ఇళ్లను ఏ విధంగా నేలమట్టం చేశారో, అలాగే ఖమ్మం లో కూడా నేలమట్టం చేశారని మండిపడ్డారు. సొంత ఊళ్లలో బతుకుదెరువు లేక వలస వచ్చిన అభాగ్యులు అని ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదువుకున్న అధికారులు పాలకుల చేతిలో కీలుబొమ్మలుగా మారి కనీస మానవత్వం లేకుండా వ్యవహరించడం దారుణమని ఈటల రాజేందర్ విమర్శించారు. న్యాయస్థానం ఆదేశాలు లేకుండానే తెల్లవారుజామున నాలుగు గంటలకే పేదల గుడిసెలను నేలమట్టం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పేదలపై ప్రతాపం చూపుతున్న ముఖ్యమంత్రికి బడాబాబులు ఆక్రమించుకున్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను కూల్చే దమ్ము ఉందా అని మరోసారి సవాల్ విసిరారు. ఈ కూల్చివేతలకు కారణమైన అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి అదే స్థలంలో రెండు పడక గదుల ఇళ్లు నిర్మించాలన్నారు. అలాగే ప్రతి కుటుంబానికి యాభై వేల నుంచి లక్ష రూపాయల వరకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఈటల డిమాండ్ చేశారు.

## ఓవైసీ సోదరుల చేతిలో ప్రభుత్వ స్టీరింగ్.. రేవంత్‌పై బీజేపీ నేతల ఆగ్రహం



ప్రతిఘటన, కామారెడ్డి : కామారెడ్డి జిల్లాలో శనివారం బీజేఎల్పీ సమావేశం జరిగింది. శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు దన్ పాల్ సూర్యనారాయణ గుప్త, పాయల్ శంకర్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాల్వాయి హరీశ్ బాబు, రామారావు పవార్, ఎమ్మెల్సీలు అంజి రెడ్డి, ఏవీఎన్ రెడ్డి హాజరయ్యారు. ఇటీవల కామారెడ్డిలో జరిగిన పరిణామాలు, గొందరగోళ పరిస్థితులపై బీజేపీ ఎల్పీ సమావేశమైంది. అనంతరం మీడియా సమావేశంలో శాసనసభ పక్ష నేత మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యేపైనే దాడి జరిగితే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోకుండా బీజేపీ కార్యకర్తలపై కేసులు పెట్టారని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు.రాష్ట్రంలో పూర్తిగా లా అండ్ ఆర్డర్ గతి తప్పిందనడానికి ఇటీవల జరిగిన ఘటనలు నిదర్శనం అని, వీటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ బలమేంటో ఇటీవల జరిగిన ఎన్నికలే తెలియజేశాయన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీని గెలిపించే దిశగా ప్రజలు కదులుతున్నారన్నారు. ఎమ్మెల్యే రమణారెడ్డి పరామర్శకు వెళ్లే నేతలను హౌస్ అరెస్ట్ చేశారన్నారు. రాష్ట్రంలో హోం శాఖ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తుందా, ఎంఐఎం ఆధ్వర్యంలో కొనసాగుతుందా తెలియడం లేదన్నారు. బాన్సువాడ ఘటనలో బీజేపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారని ఏలేటి ఆరోపించారు. ఓవైసీ అన్నదమ్ములకు రాష్ట్ర ప్రభుత్వ స్టీరింగ్ అప్పగించినట్టు ఉందని ఏలేటి ఆరోపించారు. రాష్ట్రంలో రైతు భీమా అమలుచేయాలని అసెంబ్లీలో ఒత్తిడి తెస్తామని, హామీలను అటకెక్కించి, రాష్ట్రంలో శాంతి భద్రతలను గాలికి వదిలేసిందన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ఆదిలాబాద్ నుంచి లక్ష మంది రైతులతో వినతి పత్రాలు స్వీకరిస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడారు. కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి ఘటన బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# అధఃపాతాళానికి హైదరాబాద్.. నగరంలో ప్రతీది స్కామే..

- రేవంత్ రెడ్డి 24 నెలలుగా చేసింది రియల్ ఎస్టేట్ వ్యాపారమే
- నగరాన్ని గాలికొదిలి.. ఫ్యూచర్ సిటీపైనే ఆయన దృష్టి
- రేవంత్ హయాంలో అన్ని రంగాల్లో తిరోగమనమే
- సీఎంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు విమర్శలు



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరాన్ని గత రెండేళ్ల పాలనతో అధఃపాతాళానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు పోయిందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేవలం తన ఆర్థిక ప్రయోజనాలు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల కోసం మాత్రమే సీఎం పరిపాలన చేస్తున్నారన్నారు. అందుకే హైదరాబాద్ నగరంలో భూములే లక్ష్యంగా అక్రమ సంపాదన కోసమే పూర్తి స్థాయిలో హైదరాబాద్ నగరాన్ని పతనానికి పడగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

**గత పదేళ్లలో లేని విధంగా..**

హైదరాబాద్‌లో శనివారం జీహెచ్ఎంసీ నగర పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లతో కేటీఆర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రూ.వేల కోట్ల రూపాయలను రాష్ట్ర రాజధాని నుంచి దోచుకోవడానికి 'హైడ్రా' నుంచి మొదలుకొని పారిశ్రామిక భూముల స్కామ్, టీడీఆర్ స్కామ్, ఫోర్త్ సిటీ భూముల కుంభకోణానికి పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి 24 నెలలుగా చేసింది కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారమే అని అన్నారు. రాష్ట్ర రాజధానిలో కనీసం దోమల నివారణ కూడా చేయలేనంత దుర్మార్గమైన పరిపాలనా వైఫల్యం నెలకొని ఉందని విమర్శించారు. నగరంలో 10 సంవత్సరాల క్రితం ఎప్పుడూ లేనటువంటి కరెంట్ కోతలు, మంచినీటి ఇబ్బందులు, పారిశుధ్య సమస్యలు అన్ని తిరిగి రాష్ట్ర రాజధానిలో దర్శనమిస్తున్నాయన్నారు.

**నగరాన్ని గాలికొదిలి.. ఫ్యూచర్ సిటీపైనే..**

సీఎం రేవంత్ అవగాహన రాహిత్యంతో అక్రమ సంపాదన లక్ష్యంగా తన భూములకు విలువ తీసుకురావడం కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో ఉన్న సిటీని పట్టించుకోవడం లేదన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రం నుంచి మొదలుకొని ఇతర దేశాలకు ఎక్కడ వెళ్లినా కూడా హైదరాబాద్ గురించి మాట్లాడకుండా కేవలం తన స్వప్రయోజనాల కోసం ఫ్యూచర్ సిటీ గురించి మాత్రమే మాట్లాడుతున్నారని అన్నారు. ఉన్న హైదరాబాద్ నగరంలో మౌలిక వసతుల కల్పన చేయకుండా కనీస పౌర సేవలు అందించకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

**అన్ని రంగాల్లో తిరోగమనం**

ఈ కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరాన్ని అన్ని రంగాల్లో తిరోగమనంలోకి తీసుకువెళ్తుందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అగ్రశ్రేణి మెట్రో నగరంగా తీర్చిదిద్దామన్నారు. కరెంట్ కోతలు లేకుండా తాగునీరు, పారిశుధ్యం నుంచి మొదలుకొని ప్రజా రవాణా వరకు అన్ని రంగాల్లో నగరాన్ని ముందుకు తీసుకుపోయామని గుర్తు చేశారు. అందుకే ప్రజలు రెండు సార్లు రాష్ట్ర రాజధానిలో మేయర్ పీఠాన్ని తమ పార్టీకి కట్టబెట్టారన్నారు.

**ఆర్థిక ఇంజిన్ కూలగొట్టారు**

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ నగరంలో సొంతంగా మేయర్ పీఠం పైన గులాబీ జెండాను ఎగురవేశామని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తన అరాచకాలతో, అవినీతితో పట్టణాన్ని పూర్తిగా పండబెట్టిందని తెలంగాణ ఆర్థిక ఇంజన్‌ను కూలగొట్టిందని కేటీఆర్ ఆరోపించారు. నగరంలో రియల్ ఎస్టేట్‌ను నగర ఆర్థిక వ్యవస్థను, వ్యాపార అవకాశాలు అన్నింటినీ కుప్పకూల్చిందన్నారు.

## శారదాపీఠం భూమి కేటాయింపు రద్దు



-మొదటిపేజీ తరువాయి

రేవంత్ సర్కార్ రద్దు చేసింది. అత్యంత విలువైన ఈ భూమిని కేవలం గజం రూపాయి చొప్పున ఆధ్యాత్మిక కార్యక్రమాల పేరుతో అప్పగించడంపై మొదటి నుంచీ విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ కేటాయింపును రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సదరు భూమిని హైదరాబాద్ జలమండలి అవసరాల నిమిత్తం బదిలీ చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన కేటాయింపులపై అధికారుల తీరును సీఎం ప్రశ్నించారు.

**శాంతిభద్రతలు, ప్రమాదాలపై దిగ్భ్రాంతి**

పాలనాపరమైన సమీక్షలతో పాటు, వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. పేలుడు ఘటనలు, ప్రాణనష్టం వంటి విషయాల్లో బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు. బాణాసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతూనే, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు స్పష్టం చేశారు.

## మక్కా యాత్ర ప్రమాద బాధితులకు 'రేవంత్' చేయూత



-మొదటిపేజీ తరువాయి

వెళ్లి తిరిగి రాని లోకానికి వెళ్లడం అత్యంత దురదృష్టకరమని, ఆయా కుటుంబాల్లోని కష్టాలను తీర్చలేకపోయినా, ఆర్థికంగా అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బాధితులకు ఏ అవసరం వచ్చినా ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**ఘటన నేపథ్యమిదే..**

గతేడాది నవంబర్ 17వ తేదీన మక్కా నుంచి బయలుదేరిన యాత్రికుల బస్సు మదీనా సమీపంలో ఘోర ప్రమాదానికి గురైంది. వేగంగా వెళ్తున్న బస్సు ముందున్న డీజిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన 44 మంది యాత్రికులు బస్సులోనే సజీవ దహనమయ్యారు. డీజిల్ ట్యాంకర్ పేలడంతో మంటలు క్షణాల్లో బస్సు అంతటా వ్యాపించి, లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం కూడా లేకుండా పోయింది. ఈ వార్త అప్పట్లో నగరాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి మృతుల కుటుంబాలను గుర్తించి, వారికి తగిన నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టింది

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
ఆదివారం 1 మార్చి 2026

# సంపాదకీయం

## టెక్ దిగ్గజాల చేతుల్లో ఏఐ

మనం జీవిస్తున్న కాలాన్ని 'ఏఐ యుగం'గా చెప్పుకుంటే అతిశయోక్తి కాదేమో! ఎందుకంటే.. ఇకపై కృత్రిమ మేధస్సు ప్రయోగశాలలకు మాత్రమే పరిమితం కాదు, మన జీవితంలోకి ఒక శక్తిగా ప్రవేశిస్తుంది. ఇది మన కాలపు అత్యంత శక్తివంతమైన సాంకేతిక విప్లవం. డేటా అనే ఇంధనంతో, ఆల్గోరిథమ్స్ అనే యంత్రాంగంతో, అపార గణనశక్తితో దూసుకొస్తున్న ఈ విప్లవం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ఉపాధి నిర్మాణాన్ని, జ్ఞాన ఉత్పత్తి విధానాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇది ఇప్పుడు సాంకేతిక అభివృద్ధిని మాత్రమే కాదు, ఆధునిక సమాజ రూపురేఖలనే మార్చే పరిణామంగా ముందుకొస్తోంది. విద్యా వైద్యం నుంచి వ్యవసాయం వరకు, పరిశ్రమల నుంచి పరిపాలన వరకు ప్రతీ రంగంలోనూ దీని ప్రభావాలు కనిపిస్తున్నాయి. అయితే ఇక్కడ ప్రశ్న ఒక్కటే? ఈ సాంకేతిక విప్లవం మానవ సమాజాన్ని సమానత్వ దిశగా నడిపిస్తుందా? లేక సంపద కేంద్రీకరణకు మరో ఆయుధంగా మారుతుందా? చరిత్రలోకి చూస్తే మూడు మహా పరివర్తన దశలు స్పష్టంగా కనిపిస్తాయి. వ్యవసాయ విప్లవం, పారిశ్రామిక విప్లవం, ఇప్పుడు మనం జీవిస్తున్న డిజిటల్ విప్లవం. ఈ ప్రతి సాంకేతిక విప్లవం సమాజానికి ఒక గొప్ప వాగ్దానం చేసింది. వ్యవసాయ విప్లవం "ఆహార భద్రత"ను వాగ్దానం చేసింది. పారిశ్రామిక విప్లవం "సమృద్ధి"ని వాగ్దానం చేసింది. ఇప్పుడు డిజిటల్-ఏఐ విప్లవం సైతం అపారమైన "మేధో అవకాశాలు"ను వాగ్దానం చేస్తోంది. కానీ, ఈ ప్రతి దశలోనూ చరిత్ర పదేపదే నిరూపించిన సత్యం ఒకటే? అదేమిటంటే, "వాగ్దానాలు అందరికీ, లాభాలు మాత్రం కొందరికే". వ్యవసాయ విప్లవం మనిషిని స్థిర జీవనానికి తీసుకు వచ్చింది. భూమి ఉత్పత్తి సాధనంగా మారింది. భూ యాజమాన్యమే అధికారానికి పునాది అయింది. సమాజం వర్గీకృతమైంది. అసమానత వ్యవస్థీకృతమైంది. పారిశ్రామిక విప్లవం ఈ నిర్మాణాన్ని కూల్చలేదు, అది రూపం మార్చింది. యూరప్‌లో మొదలైన ఆ మార్పు యంత్రాన్ని, పెట్టుబడిని కేంద్రంగా పెట్టింది. ఉత్పత్తి సామర్థ్యం విపరీతంగా పెరిగింది. కానీ, యంత్రం ఎవరి చేతుల్లో వుందో వారే సంపదను సొంతం చేసుకున్నారు. కార్మికశ్రమ మార్కెట్‌లో వస్తువుగా మారింది. మరి డిజిటల్ విప్లవం ఏం చేయబోతోంది. ఏఐ రాకతో డిజిటల్ విప్లవం అసాధారణమైన శక్తిని సంతరించుకుంది. ఇది కేవలం శ్రమను కాదు, ఆలోచనను కూడా యంత్రాలతో పంచుకుంటోంది. డేటా సేకరణ, విశ్లేషణ, నిర్ణయాలు.. ఇవన్నీ ఆల్గోరిథమ్‌ల చేతుల్లోకి వెళ్తున్నాయి. మానవ మేధస్సు కూడా ఇప్పుడు కొలవదగిన, ప్రోగ్రాం చేయదగిన వనరుగా మారుతోంది. ఏఐ? కేవలం మరో సాంకేతిక సాధనం కాదు, అది ఒక శక్తి సమీకరణం. సమాచారాన్ని గ్రహించి, విశ్లేషించి, నమూనాలు గుర్తించి, అంచనాలు వేయగల వ్యవస్థ. మనిషి మేధస్సు చేసే పనుల్లో కొన్ని యంత్రాలకు అప్పగించగల స్థాయికి టెక్నాలజీ చేరిన దశ ఇది. అందుకే దీని శక్తిసామర్థ్యాలు విస్తృతమైనవి. ఏఐ ప్రధాన శక్తి డేటా విశ్లేషణలో అసాధారణ సామర్థ్యం. లక్షల కోట్ల డేటాలో దాగి ఉన్న నమూనాలను క్షణాల్లో గుర్తించి వ్యాధి నిర్ధారణ, మార్కెట్ ధోరణులు, వాతావరణ మార్పులు వంటి అంశాలను ముందుగానే అంచనా వేయగలదు. పునరావృత పనులు, భారీ లెక్కలు, క్రమబద్ధమైన ప్రాసెసింగ్ వంటి కార్యాలను వేగంగా, తప్పుల్లేకుండా పూర్తిచేసి పరిశ్రమల్లో ఖర్చు తగ్గిస్తుంది, సేవారంగంలో వేగం పెంచుతుంది. ప్రభుత్వ పనుల్లో ఆలస్యం తగ్గిస్తుంది. భవిష్యత్ అంచనాల ద్వారా పంట దిగుబడులు, వ్యాధి వ్యాప్తి వంటి విషయాల్లో ముందస్తు నిర్ణయాలను మెరుగుపరుస్తుంది. విద్య, ఆరోగ్య, వ్యవసాయ సూచనలు అందిస్తుంది. రచన, అనువాదం వంటి సాంకేతికతలతో స్థానిక భాషల్లో జ్ఞానాన్ని ప్రజలకు చేరువచేస్తుంది. సంగీత పరిశోధనల్లో సహాయకారిగా సృజనాత్మక ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు, ఆరోగ్య అత్యవసరాల్లో ముందస్తు హెచ్చరికలు ఇచ్చి సంక్షోభ నివారణలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఇవన్నీ కలిపి చూస్తే, ఏఐ ఒక అసాధారణమైన శక్తిగా కనిపిస్తుంది. దాన్ని సరైన దిశలో ఉపయోగిస్తే ప్రజల అభివృద్ధికి ఇదొక తిరుగులేని సాధనం. ఇది ఉత్పాదకతను పెంచగలదు. ఖర్చులను తగ్గించగలదు. సేవలను సమర్థవంతం చేయగలదు. జ్ఞానాన్ని, అవకాశాలను విస్తరించగలదు. కానీ, ఒక సత్యం గుర్తుంచుకోవాలి. మంచిగానీ, చెడుగానీ అది స్వతహాగా ఏదీ చేయదు. ఏఐ శక్తి దాని వినియోగంపై ఆధారపడి ఉంటుంది. అది ప్రపంచాన్ని సమాన అవకాశాల దిశగా మలచగలదు, అసమానతను మరింత గాఢం చేసే దిశగానూ నడుపగలదు. ప్రస్తుత ప్రపంచ దృశ్యాన్ని చూస్తే రెండు ప్రధాన నమూనాలు కనిపిస్తాయి. మొదటిది అమెరికా నమూనా. అక్కడ ఏఐ అభివృద్ధి పూర్తిగా ప్రయివేటు పెట్టుబడిపై ఆధారపడుతోంది. పరిశోధన, ప్రతిభ, ఆవిష్కరణలన్నీ భారీ కార్పొరేట్ పెట్టుబడుల చుట్టూ తిరుగుతున్నాయి. డేటా, డిజిటల్ వేదికలు, ఆల్గోరిథమ్‌లు కొద్దిమంది టెక్ దిగ్గజాల చేతుల్లో కేంద్రీకృతమయ్యాయి. వెంచర్ క్యాపిటల్ ప్రవాహం, స్టాక్ మార్కెట్ అంచనాలు, మోనోపోలీ స్థాయి టెక్ దిగ్గజాల ఆధిపత్యం? ఇవన్నీ ఆ నమూనా స్వభావాన్ని నిర్ధారిస్తున్నాయి. ఇక్కడ ఏఐ ఒక ప్రజా సాధనం కాదు, అది వ్యాపార ఆస్తి. డేటా ప్రజల జీవితాల నుంచి సేకరించబడుతుంది, కానీ, దాని విలువ షేర్ హోల్డర్లకు చేరుతుంది. ఆల్గోరిథమ్‌లు పారదర్శకత కంటే లాభదాయకతను ముందుకు నెడతాయి. పోటీ పేరుతో కొన్ని కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా డేటా మౌలిక వసతులను నియంత్రించే స్థాయికి చేరాయి. ఫలితంగా డిజిటల్ ప్రజాస్వామ్యం క్రమంగా మార్కెట్ ఆధిపత్యంగా మారుతోంది. ఏఐ శక్తి సామూహిక ఆస్తిగా కాక, కార్పొరేట్ మూలధనంగా మారుతున్న ప్రమాదం అక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. ఇక రెండోది చైనా నమూనా. అక్కడ ఏఐ అభివృద్ధి ప్రభుత్వ నియంత్రణలో ఉంటుంది. ఒక వ్యూహాత్మక దిశలో ముందుకు సాగుతోంది. దీర్ఘకాల ప్రణాళిక, ప్రభుత్వ పెట్టుబడులు, నియంత్రణలు, స్వదేశీ టెక్నాలజీ సామర్థ్యాల పెంపు? ఇవి ఆ దిశను నిర్ణయిస్తున్నాయి. తయారీ రంగంతో ఏఐని సమన్వయం చేయడం, స్వంత చిప్ పరిశ్రమను అభివృద్ధి చేయడం, భారీ డేటా మౌలిక వసతులు నిర్మించడం లాంటివన్నీ వేగవంతమైన పురోగతికి దారి తీస్తున్నాయి. అక్కడ సాంకేతికతను కేవలం మార్కెట్ లాభాలకే పరిమితం చేయడంలేదు, జాతీయ అభివృద్ధి వ్యూహంలో భాగం చేస్తున్నారు. ముఖ్యంగా ఆవిష్కరణలను స్వదేశీ సామర్థ్యంగా మార్చుకోవడంలో చైనా దృఢ సంకల్పం గమనించదగినది. ఏఐను దిగుమతి చేసుకునే సాంకేతికతగా కాక, స్వయంగా సృష్టించే శక్తిగా అభివృద్ధి చేయాలన్న దృష్టి అక్కడ స్పష్టంగా ఉంది. మరి ఈ ఆధునికశక్తి సమీకరణంలో భారత్ ఎక్కడ నిలబడి ఉంది? మన దగ్గర విస్తారమైన డేటా ఉంది. యువ జనాభా, డిజిటల్ వినియోగం, చవక ఇంటర్నెట్ మనకు బలమైన వనరులుగా ఉన్నాయి. కానీ, ఆ డేటాకు విలువను సృష్టించే మౌలిక వసతులు మనవేనా? ఆధునిక చిప్ తయారీ, అధిక సామర్థ్య కంప్యూటింగ్, ప్రాథమిక ఏఐ పరిశోధనలపై తగిన కేంద్రీకరణ లేదు. మనం సాంకేతిక సృష్టికర్తలమా? లేక కేవలం వినియోగదారులం మాత్రమేనా? ఇదే కీలక ప్రశ్న. మన దేశంలో ప్రాథమిక పరిశోధనలపై పెట్టుబడులు తక్కువ. విశ్వవిద్యా లయాలు-పరిశ్రమల అనుసంధానం పరిమితం. హై-ఎండ్ చిప్ తయారీ, భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులు, స్వదేశీ ఏఐ మోడళ్ల అభివృద్ధి.. ఇవన్నీ ఇంకా కనీస దశలో కూడా లేవు. సమ్మిట్‌లలో పెద్ద లక్ష్యాలు వినిపిస్తున్నా, పరిశోధనలూ ప్రయోగశాలల్లో మాత్రం అవసరమైన కార్యాచరణ కనిపించడం లేదు. దీన్ని అధిగమించకపోతే, మనం ప్రపంచానికి కేవలం డేటా వనరుగా, చవక శ్రమ వనరుగా, వినియోగదారుల మార్కెట్‌గా మారే ప్రమాదం ఉంది. డేటా మన ప్రజలదయి, దాని విలువను సృష్టించే వేదికలు ఇతరులవైతే, అది ఆధునిక రూపంలోని వలసవాదమే అవుతుంది. ఇది కేవలం సాంకేతిక వెనుకబాటుతనం కాదు, ఆలోచనా వెనుకబాటుతనం. పరిశోధనను ఖర్చుగా కాక పెట్టుబడిగా చూడగల దృక్పథం అవసరం. లేకపోతే మనం డిజిటల్ యుగంలో కూడా ముడి వనరులు సరఫరా చేసే దేశంగానే మిగిలిపోతాం. అంతిమంగా మనం గుర్తించాల్సిన అంశమేమింటే.. ఏఐ మనిషిని భర్తీ చేయడానికి వచ్చిన విప్లవం కాదు, మనిషి సామర్థ్యాలను విస్తరించేందుకు వచ్చిన శక్తి. కానీ, చరిత్ర మనకు నేర్పిన పాఠం ఏమిటి? ప్రతి శక్తివంతమైన సాధనం రెండు దిశల్లో ప్రయాణించగలదు. ఒక దిశ అసమానతలు లేని అభివృద్ధి వైపు, మరో దిశ ఆధిపత్యం వైపు. ఏఐ సమాన అవకాశాలను విస్తరించగలదు. గ్రామీణ విద్యార్థికి ఉత్తమ బోధన అందించగలదు. చిన్న రైతుకు శాస్త్రీయ సూచనలు ఇవ్వగలదు. ప్రభుత్వ సేవలను పారదర్శకంగా మార్చగలదు. వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురాగలదు. ఇవన్నీ మానవ గౌరవాన్ని పెంచే దిశలు.

# ప్రాథమిక హక్కులు- రాజ్యాంగ రక్షణ



ప్రతి సంవత్సరం మార్చి మొదటి తేదీన, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలు ప్రపంచ పౌర రక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1990లో, ఇంటర్నేషనల్ సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ ఈ రోజును ప్రపంచ పౌర రక్షణ దినంగా ప్రకటించింది. ఐసిడిఒ అనేది ఒక లాభాపేక్ష లేని ఇంటర్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్. పౌర హక్కుల పరిరక్షణ, సౌకర్యాల కల్పన, ప్రజల ఎదుగుదల, సురక్షితంగా ఉండటానికి సహాయ పడుతుంది. 59 దేశాలు ఐసిడిఒలో సభ్యత్వం కలిగి ఉన్నాయి. ఇది ఆయా దేశాలలోని పౌర రక్షణ దళాల మానవ వనరుల నిర్వహణను మెరుగు పరచడానికి అనేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అన్ని దేశాలు, ప్రజలందరికీ ఆదర్శ నీయమైన ఒక ఉమ్మడి ప్రమాణంగా పత్రాన్ని నిర్దేశిస్తూ 1948 డిసెంబరు 10న ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఐక్య రాజ్యసమితి సర్వప్రతినిధి సభ తీర్మానాన్ని ఆమోదించి, ప్రపంచ మంతటా పరిరక్షించు కోవాల్సిన ప్రాథమిక మానవ హక్కులను తొలిసారిగా నిర్దేశించింది. ఈ సందర్భంగా హక్కుల విషయంలో ఏ ఆర్టికల్ ఏమి సూచిస్తుంది అనే విషయం తెలుసుకుందాం. ఆర్టికల్ 1: మనుషులందరికీ పుట్టుకతోనే స్వేచ్ఛ, సమానత్వం లభిస్తాయి. గౌరవం, హక్కుల విషయంలో అందరూ సమానులే. మనుషులందరికీ సొంత ఆలోచన, అంతః చేతన ఉంటాయి. ఒకరితో మరొకరు సోదరభావంతో మెలగాలి. ఆర్టికల్ 2: ఈ పత్రంలోని అన్ని హక్కులూ, స్వేచ్ఛలూ ప్రతి ఒక్కరికీ ఉంటాయి. జాతి, రంగు, లింగం, భాష, మతం లాంటి అంశాల ప్రాతిపదికగాగాని, రాజకీయ నేపథ్యం వల్లగాని, భిన్నాభిప్రాయం వల్లగాని, జాతీయ లేదా సామాజిక మూలాలవల్లగాని, సంపదలో వ్యత్యాసాల వల్లగాని, పుట్టుక లేదా ఇతర ప్రాతిపదికల వల్లగాని వివక్ష చూపడానికి వీల్లేదు. వ్యక్తులను వారి దేశం లేదా భూభాగం రాజకీయ/అంతర్జాతీయ హోదా ఏమిటనేదాని ప్రాతిపదికగా ఎలాంటి వివక్షా చూపరాదు. ఆర్టికల్ 3: జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు, స్వీయ భద్రతా హక్కు ప్రతి మనిషికీ ఉంటాయి. ఆర్టికల్ 4: ఎవ్వరినీ బానిసగా చేసుకోవడానికి వీల్లేదు. బానిసత్వాన్ని, బానిస వ్యాపారాన్ని అన్ని రూపాల్లో నిషేధించాలి. ఆర్టికల్ 5: ఎవ్వరినీ చిత్రహింసలకు గురిచేయరాదు. ఎవ్వరినీ క్రూరమైన, అమానవీయమైన, అవమాన కరమైన శిక్షకు గురిచేయరాదు. ఆర్టికల్ 6: ప్రతి చోట చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపు పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది.ఆర్టికల్ 7: చట్టం ముందు అందరూ సమానులే. ఎలాంటి వివక్షా లేకుండా చట్టపరమైన రక్షణ పొందే హక్కు అందరికీ ఉంది. ఈ డిక్లరేషన్‌కు విరుద్ధంగా, ఎలాంటి వివక్షకు గురికాకుండా అందరికీ సమానమైన రక్షణ ఉంటుంది. ఆర్టికల్ 8: రాజ్యాంగం, లేదా చట్టం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లే చర్యల విషయంలో సంబంధిత జాతీయ ట్రైబ్యునల్ నుంచి పరిష్కారం పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 9: ఎవ్వరినీ ఏకపక్షంగా అరెస్టు చేయడానికిగాని, నిర్బంధించడానికిగాని, ప్రవాసానికి పంపించడానికిగాని వీల్లేదు. ఆర్టికల్ 10: క్రిమినల్ నేరాభియోగాలపైగాని, తన హక్కులను, బాధ్యతలను నిర్ణయించే విషయంలోగాని స్వతంత్ర, నిష్పాక్షిక ట్రైబ్యునల్ ఆధ్వర్యంలో నిష్పాక్షిక, బహిరంగ విచారణ పొందే హక్కు ప్రతి ఒక్కరికీ సమానంగా ఉంది. ఆర్టికల్ 11: (1) శిక్షార్హమైన నేరాభియోగాన్ని ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరూ, బహిరంగ విచారణలో చట్ట ప్రకారం దోషిగా తేలే వరకు నిర్దోషిగానే భావించాలి. ఈ మేరకు ఆ వ్యక్తికి హక్కు ఉంది. ఈ విచారణలో, తనను తాను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని హామీలూ వ్యక్తికి ఉంటాయి. (2) ఎవరైనా వ్యక్తి చేసిన తప్పిదం లేదా పని అది జరిగిన సమయానికి జాతీయ, లేదా అంతర్జాతీయ చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరం కాకపోతే, ఆ వ్యక్తిని శిక్షార్హమైన నేరంలో దోషిగా ప్రకటించడానికి వీల్లేదు. శిక్షార్హమైన నేరం జరిగినప్పుడు వర్తించే శిక్ష కన్నా తీవ్రమైన శిక్షను విధించడానికి కూడా వీల్లేదు. ఆర్టికల్ 12: ఏ ఒక్కరి వ్యక్తిగత గోప్యత, కుటుంబం, ఇల్లు, ఉత్తరప్రత్యుత్తర విషయాల్లో ఏకపక్షంగా జోక్యం చేసుకోవడానికిగాని, గౌరవ ప్రతిష్ఠలపై దాడి చేయడానికిగాని వీల్లేదు. అలాంటి జోక్యం, దాడుల నుంచి చట్టపరమైన రక్షణ పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 13:(1) దేశంలో స్వేచ్ఛగా తిరిగే, నివసించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. (2) సొంత దేశం నుంచి లేదా ఏ దేశం నుంచి అయినా వెళ్లిపోయే హక్కు, తన దేశానికి తిరిగి వచ్చే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. ఆర్టికల్ 14: (1) పీడన నుంచి తప్పించుకొనేందుకు ఇతర దేశాలను ఆశ్రయం అడిగే, పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. (2) ఐక్యరాజ్యసమితి సూత్రాలకు, ప్రయోజనాలకు విరుద్ధమైన చర్యలు లేదా రాజకీయేతర నేరాలపై నిజమైన ప్రాసిక్యూషన్ జరిగే సందర్భంలో ఈ హక్కు ఉండకపోవచ్చు. ఆర్టికల్ 15: (1) ఏదైనా జాతీయతను కలిగి ఉండే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. (2) ఎవరికీ ఏకపక్షంగా జాతీయతను తొలగించకూడదు, అలాగే జాతీయతను మార్చుకొనే హక్కును నిరాకరించకూడదు. ఆర్టికల్ 16: (1) జాతి, జాతీయత లేదా మతం పరిమితులు లేకుండా పెళ్లి చేసుకొనేందుకు, కుటుంబాన్ని కలిగి ఉండేందుకు వయోజనులైన మహిళలకు, పురుషులకు హక్కు ఉంది. వివాహం చేసుకొనేటప్పుడు, వివాహ బంధంలో ఉన్న కాలంలో, దీనిని రద్దుచేసుకొనేటప్పుడు వారికి సమానమైన హక్కులు ఉంటాయి. (2) పెళ్లికి ఇద్దరు వ్యక్తుల్లో స్వేచ్ఛాయుత, సంపూర్ణ అంగీకారం ఉంటేనే పెళ్లి చేసుకోవాలి. (3) సమాజంలో కుటుంబమనేది ఒక సహజమైన, ప్రాథమికమైన భాగం. కుటుంబానికి సమాజం, రాజ్యాం రక్షణ కల్పించాలి. ఆర్టికల్ 17: (1) సొంతంగాగాని, ఇతరులతో కలసి గాని ఆస్తులు కలిగి ఉండేందుకు ప్రతి ఒక్కరికీ హక్కుంది.(2) ఎవరికీ ఏకపక్షంగా ఆస్తిని దూరం చేయడానికి వీల్లేదు. ఆర్టికల్ 18: స్వేచ్ఛాయుత అంతఃచేతనత్వానికి, స్వేచ్ఛగా ఆలోచించడానికి, మతాన్ని పాటించడానికి ప్రతి ఒక్కరికీ హక్కు ఉంది. మతాన్ని లేదా విశ్వాసాన్ని మార్చుకొనే హక్కు ఇందులో భాగం. ఒంటరిగాగాని, ఇతరులతో కలిసిగాని ప్రైవేటుగాగాని, బహిరంగంగాగాని తన మతవిశ్వాసాలను పాటించే, బోధించే స్వేచ్ఛ, పూజించే స్వేచ్ఛ అందరికీ ఉన్నాయి. ఆర్టికల్ 19: ప్రతి ఒక్కరికీ భావ ప్రకటనా హక్కు ఉంది. ఇతరుల జోక్యం లేకుండా సొంత అభిప్రాయాలు కలిగి ఉండే హక్కు, సరిహద్దులతో సంబంధం లేకుండా ఏ మార్గం నుంచైనా సమాచారం, ఆలోచనలు కోరే, స్వీకరించే హక్కు ఇందులో భాగం. ఆర్టికల్ 20: (1) స్వేచ్ఛగా శాంతియుతంగా సమావేశమయ్యేందుకు, సంఘంగా ఏర్పడేందుకు ప్రతి ఒక్కరికీ హక్కుంది. (2) ఏదైనా సంఘంలో భాగస్వామి కావాలని ఎవరినీ బలవంతపెట్టడానికి వీల్లేదు.ఆర్టికల్ 21: ప్రతి ఒక్కరికీ తమ దేశ ప్రభుత్వంలో ప్రత్యక్షంగా లేదా ఎంచుకున్న ప్రతినిధి ద్వారా భాగస్వామ్యమయ్యే హక్కు ఉంది. 1) ప్రతి ఒక్కరికీ తమ దేశంలో ప్రభుత్వ సేవలను సమానంగా పొందే హక్కు ఉంది. 2) ప్రభుత్వానికి ప్రజాభీష్టం ప్రాతిపదిక కావాలి. నిర్దేశిత కాలానికి జరిగే నిజమైన ఎన్నికల్లో ఈ ప్రజాభీష్టం వ్యక్తంకావాలి. ఈ ఎన్నికల్లో సార్వజనీన, సమానమైన ఓటు హక్కు ఉంటుంది. రహస్య ఓటింగ్ లేదా దానికి సమానమైన స్వేచ్ఛాయుత ఓటింగ్ నిర్వహించాలి. ఆర్టికల్ 22: సమాజంలో సభ్యులుగా ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత హక్కు ఉంది. తన గౌరవానికి, తన వ్యక్తిత్వం స్వేచ్ఛగా అభివృద్ధి చెందటానికి ఆవశ్యకమైన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను జాతీయ కృషి, అంతర్జాతీయ సహకారం ద్వారా దేశ వనరులకు అనుగుణంగా సాధించుకునే హక్కు ఉంది. ఆర్టికల్ 23: (1) ప్రతి ఒక్కరికీ పని చేయడానికి హక్కుంది. స్వేచ్ఛగా కోరుకొన్న ఉపాధిని పొందడానికి, పనిచేయటానికి న్యాయమైన, అనుకూలమైన పరిస్థితులు పొందడానికి, నిరుద్యోగిత నుంచి రక్షణ పొందటానికి అందరికీ హక్కుంది. (2) ప్రతి ఒక్కరికీ ఎలాంటి వివక్షా లేకుండా సమాన పనికి సమాన వేతనం పొందే హక్కు ఉంది. (3) పని చేసే ప్రతి ఒక్కరికీ తాను, తన కుటుంబం మానవ గౌరవంతో మనుగడ సాగించటానికి హామీ ఇచ్చేలా న్యాయమైన, అనుకూలమైన వేతనం పొందే హక్కు ఉంది. అవసరమైతే ఇతర మార్గాల్లో అదనంగా సామాజిక రక్షణ పొందే హక్కు ఉంది. (4) ప్రతి ఒక్కరికీ తన ప్రయోజనాలను కాపాడుకోవటం కోసం కార్మిక సంఘాలు ఏర్పాటు చేయటానికి, వాటిలో చేరటానికి హక్కు ఉంది. ఆర్టికల్ 24: ప్రతి ఒక్కరికీ పనిగంటలకు హేతుబద్ధమైన పరిమితిని, నిర్దేశిత కాలానికి వేతనంతో కూడిన సెలవులను పొందే హక్కు, విశ్రాంతి, విరామం తీసుకునే హక్కు ఉన్నాయి. ఆర్టికల్ 25: (1) ప్రతి వ్యక్తికీ ఆహారం, దుస్తులు, నివాసం, వైద్యసేవలు, ఇతర సామాజిక సేవలు సహా.. తను, తన కుటుంబ ఆరోగ్య, సంక్షేమాలకు తగిన జీవన ప్రమాణం పొందే హక్కు ఉంది. నిరుద్యోగం, అనారోగ్యం, వైకల్యం, వైధవ్యం, వృద్ధాప్యం లేదా తన నియంత్రణలో లేని ఇతర కారణాల వల్ల జీవనోపాధి లేకపోవటం నుంచి భద్రత పొందే హక్కు ఉంది. (2) మాతృత్వం సమయంలో మహిళలకు, బాల్యదశలో చిన్నారులకు ప్రత్యేక సేవ, సహాయాలు పొందే హక్కు ఉంది. పెళ్లి ద్వారా పుట్టినా, పెళ్లి కాకుండా పుట్టినా చిన్నారులు అందరికీ సమానమైన రక్షణ లభించాలి. ఆర్టికల్ 26:(1) ప్రతి ఒక్కరికీ విద్యాహక్కు ఉంది. కనీసం ప్రాథమిక, మౌలిక స్థాయుల్లో అయినా అందరికీ విద్య ఉచితంగా అందాలి. ప్రాథమికవిద్య తప్పనిసరిగా ఉండాలి. సాంకేతిక విద్య, వృత్తినైపుణ్య విద్య అందుబాటులో ఉండాలి. ఉన్నతవిద్య ప్రతిభ ప్రాతిపదికన అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలి. (2) మానవ వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసించేలా, మానవ హక్కులను, మౌలిక స్వాతంత్ర్యాలను గౌరవించేదిగా విద్య ఉండాలి. (3) తమ పిల్లలకు ఏ తరహా విద్య అందించాలో ఎంచుకునే హక్కు తల్లిదండ్రులకు ఉంది. ఆర్టికల్ 27: (1) ప్రతి ఒక్కరికీ సమాజ సాంస్కృతిక జీవనంలో స్వేచ్ఛగా పాలుపంచుకోవడానికి, కళలను ఆస్వాదించడానికి, శాస్త్రీయ పురోగతిలో, వాటి ప్రయోజనాల్లో భాగం పంచుకోవడానికి హక్కు ఉంది. (2) ప్రతి వ్యక్తికీ తను సృజించిన ఎలాంటి శాస్త్రీయ, సాహిత్య, కళా ఉత్పత్తుల నుంచి లభించే నైతిక, భౌతిక ప్రయోజనాలను పరిరక్షించుకునే హక్కు ఉంది. ఆర్టికల్ 28: ఈ ప్రకటనలో నిర్దేశించిన హక్కులు, స్వాతంత్ర్యాలు సంపూర్ణంగా సాకారమయ్యే సామాజిక, అంతర్జాతీయ పరిస్థితులు పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 29: తన వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసించటం సాధ్యమయ్యే సమాజం పట్ల ప్రతి ఒక్కరికీ బాధ్యతలు కూడా ఉన్నాయి. (1) ప్రతి ఒక్కరూ తన హక్కులు, స్వాతంత్ర్యాలను వినియోగించుకొనే క్రమంలో- ప్రజాస్వామ్య సమాజంలో ఇతరుల హక్కులు, స్వాతంత్ర్యాలకు తగిన గుర్తింపు, గౌరవం, నైతికత, శాంతిభద్రతలు, సాధారణ సంక్షేమం కోసం చట్టం నిర్దేశించిన పరిమితులకు మాత్రమే లోబడి ఉండాలి. (2) ఈ హక్కులు, స్వాతంత్ర్యాలను ఏ విధంగానూ ఐక్యరాజ్యసమితి లక్ష్యాలు, సూత్రాలకు వ్యతిరేకంగా ఉపయో గించరాదు. ఆర్టికల్ 30: ఈ ప్రకటనలోని ఏ అంశమైనా ఇందులో నిర్దేశించిన హక్కులు, స్వాతంత్ర్యాల్లో దేనినైనా ధ్వంసం చేసేందుకు, లేదా ఏమైనా చేసేందుకు ఏ రాజ్యానికీ, సంఘానికీ, వ్యక్తికీ వీలు కల్పిస్తున్నట్లు భావించరాదు.

# భారతీయ తొలి నోబెల్ గ్రహీత

వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని, దాని వల్లనే అది తన గమనాన్ని మార్చుకుంటుందని తన సిద్ధాంతాల ద్వారా రుజువు చేశారు రామన్. సూర్యుని నుంచి వెలువడే తెలుపు వర్ణపు కాంతి వాయువులోని అణువులపై పడి, వాటి ప్రయాణ దిశను మార్చు కుంటాయని తన పరిశోధనల ద్వారా తెలుసుకున్న సి.వి. రామన్ ఓ సిద్ధాంతాన్ని సూత్రీకరించాడు. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని 1928 సంవత్సరం, ఫిబ్రవరి 28న రామన్ మొట్ట మొదటిసారి ప్రకటించారు.పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింప చేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చు కుంటుంది. ఈ విషయాన్ని 1928 మార్చి 16 న బెంగుళూరులో జరిగిన శాస్త్రజ్ఞుల సదస్సులో చూపించాడు. అతను అనుకున్నట్లే 1928 ఫిబ్రవరి 28 న "రామన్ ఎఫెక్టు" ఆవిష్కరించడం జరిగింది. ఈ పరిశోధనను అభినందిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం 1929 లో "నైట్ హుడ్" బిరుదుతో సత్కరించింది. రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టిన చంద్రశేఖర వేంకట రామన్ 28-02-1928న తన పరిశోధనా ఫలితాన్ని ధృవపరచుకున్న దినాన్ని (నేషనల్ సైన్స్ డేజాతీయ విజ్ఞాన దినోత్సవము) గా భారతదేశంలో ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నారు. సైన్సులో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేసి చూపించి, విశ్వ వినువీధిలో భారత కీర్తి పతాకాన్ని రెపరెప లాడించిన మహా జ్ఞాని చంద్రశేఖర్ వెంకటరామన్ (సి వి రామన్). వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్‌ను శక్తివంతంగా చూపి, అబ్బుర పరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా నిలిచారు సర్ సివి రామన్. వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ అందుకున్న విజ్ఞాన ఖని. ఒక్క మాటలో చెప్పాలంటే వైజ్ఞానిక శాస్త్రానికే వైద్యుడిలా మారిన మహోన్నతుడు. ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేసిన వ్యక్తిల్లో సర్ సీవి రామన్ మొదటివారు. సీవీ రామన్ నవంబర్ 7, 1888 తమిళనాడులోని తిరుచురాపల్లిలో జన్మించారు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. తండ్రి విశాఖపట్నంలోని ఏవీఎన్ కళాశాలలో లెక్చరర్ గా పని చేయడం వల్ల రామన్ బాల్యం, విద్యాభ్యాసం అక్కడే జరిగింది. అనంతరం మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరి 19 ఏళ్లకు ఫిజిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పాసై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా చేరారు. ఆ సమయం లోనే పరిశోధనలపై ఆసక్తి పెంచుకున్నారు. పరిశోధనల కోసం భారతీయులు విదేశాలకు వెళ్లడమేమిటి?. విదేశీయులే.. పరిశోధనల కోసం ఇక్కడకు రావాలని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి రామన్. రామన్ ముందు వరకూ సైన్స్‌లో నోబెల్ బహుమతులు పాశ్చాత్యులకే దక్కేవి. కానీ, రామన్ అచ్చమైన భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, తలమానికమైన పరిశోధన జరిపి సైన్సులో దేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారు. 'నా మతం సైన్సు.. దానినే జీవితాంతం ఆరాధిస్తా..' అని చెప్పి తుదిశ్వాస వరకూ శాస్త్రాన్వేషణ లోనే గడిపిన దార్శనికుడు. "విజ్ఞాన శాస్త్ర సారాంశం, ప్రయోగ శాలల పరికరాలతో వికసించదు. నిరంతర పరిశోధన, స్వంతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి ఇవే విజ్ఞాన శాస్త్ర సాగరాన్ని మథించి వేస్తాయి" అంటూ ఆయన చేసిన ప్రసంగం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఉదయాకాశంలోని వెలుగుల్లో చెట్లు ఎంత అందంగా కనబడతాయో మీరు ఎప్పుడైనా గమనించారా? నాకు వీటిని చూస్తూ ఉంటే స్ఫటిక నిర్మాణం గురించిన ఆలోచనలు వస్తుంటాయి. అందుకే "విజ్ఞానం అత్యుత్తమైన సృజనాత్మక కళారూపం అని రామన్ ఎప్పుడూ చెబుతుండేవారు. మెర్క్యూరీ ల్యాంప్ నుండి ఏకవర్ణ కాంతి తరంగాలను ఒక పారదర్శక యానకం గుండా ప్రసరింపజేస్తే, యానక ధర్మాలపై ఆధారపడి ఆ కాంతిలో కొంత భాగం వివర్తనం చెంది, తక్కువ తరంగ ధైర్ఘ్యం గల కాంతిగా బహిర్గత మౌతుంది. సముద్ర జలంపై ఇదే ప్రక్రియతో నీలి రంగు కాంతి బహిర్గతమవుతుంది. దీనినే 'రామన్ ఫలితం' (రామన్ ఎఫెక్ట్) అంటారు. రామన్ జీవితంలో మరో మైలురాయి రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతం. ఈ రామన్ ఎఫెక్టు అసామాన్య మైనదని, అందులో 200 రూపాయలు కూడా ధర చేయని పరికరాలతో ఆ విషయ నిరూపణ జరగడం అద్భుతమైనదని ప్రపంచ శాస్త్రజ్ఞులంతా రామన్ ను అభినందించారు. అఖండ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన రామన్, ఫిజిక్స్ రంగంలో రామన్ ఎఫెక్ట్ కనుగొని చరిత్ర సృష్టించిన ఫిబ్రవరి 28 నే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపు కొంటున్నాం. రామన్ నూటికి నూరుపాళ్ళూ భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, పరిశోధనలు జరిపి సైన్సులో శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారాయన. 1913 లో సాహిత్యంలో మనదేశం నుండి నోబెల్ బహుమతి పొందిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అనంతరం సైన్సు రంగంలో విజయ ఢంకా మ్రోగించిన అఖండ ప్రజ్ఞాశాలి రామన్ ఒక్కరే కావడం దేశానికి గర్వకారణం. రామన్ పరిశోధనలు సైన్సులో, పారిశ్రామిక రంగంలోనూ క్రొత్తపుంతలు త్రొక్కడానికి దారితీసింది. శాస్త్ర రంగంలో రామన్ స్పెక్ట్రో స్కోపీ ఆవిర్భావానికి "భారతరత్న", 1957 లో "లెనిన్ శాంతి బహుమతి" లభించాయి. కాంతి ప్రసరణపై జరిపిన పరిశోధనలకు "నోబెల్ బహుమతి" లభించింది. స్వాతంత్ర్యం రాగానే రామన్ కు మొట్టమొదటి నేషనల్ ప్రొఫెసర్ గా ప్రభుత్వం నియమించి గౌరవించింది. 1948 లో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ గా రిటైరయ్యారు. దృష్టి, కాంతి, ధ్వని, వర్ణాలు, ద్రవాల తలతన్యత, ఖనిజాలు, డైమండ్, క్రిస్టల్ తదితర అంశాలపై పరిశోధనలు జరిపిన సి.వి. రామన్ సుమారు 465 పరిశోధన పత్రాలను వెలువరించాడు. వాటిని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగుళూరు వారు సేకరించి భద్రపరిచారు. 1949 లో బెంగుళూరులో రామన్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ స్థాపించి, 1970 నవంబరు 27 న ఆయన మరణించే వరకూ, ఆ సంస్థలో పరిశోధనలు జరిపి, మన దేశంలో సైన్సు అభివృద్ధికి మార్గదర్శకు లయ్యారు. 1971 నవంబర్ 21 న సీ.వీ. రామన్ పోస్టేజి స్టాంపును భారత ప్రభుత్వం వెలువరించి ఆ మహా శాస్త్రజ్ఞుడిని గౌరవించింది.విజ్ఞాన ఆవిష్కరణల్లో భారతీయులకు నోబెల్ రావడం గగన సదృశం. సర్ సివి రామన్ ఆ ఘనత సాధించారు. అంతేకాదు, విజ్ఞాన శాస్త్రంలో ఆఘనత సాధించిన ఏకైక ఆసియా వాసిగానూ ఖ్యాతి గడించారు.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
ఆదివారం 1
మార్చి 2026

## శనేశ్వర స్వామికి శాస్త్రోక్తంగా తిలతైల అభిషేక పూజలు




**ప్రతిఘటన, నాగర్ కర్నూల్ బ్యూరో రిపోర్టర్ విజయ్ కాంత్** శ్రీ విశ్వవసు సంవత్సరం ఫాల్గుణ మాసం శుక్ల పక్షం ద్వాదశి శనివారం బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహ దోష నివారణకు స్వామి వారికి తిలతైలా అభిషేకాలు భక్తితో వేద మంత్రచరణల మధ్య జరిగాయి. శ్రీసార్ధాసప్త జేష్ట మాత సమేత శనేశ్వర స్వామికి శనివారం ప్రత్యేకంగా తిలతైల అభిషేకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ.. ఈ మాసంలో స్వామి వారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు జన్మ రిత్యా, గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామి వారిని శక్తి మేరకు పూజించాలని అన్నారు. ఈ ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమ శివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు, దీపారాధన, నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చన పూజలు భక్తులచే నిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి. సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ ఆర్చకులు శాంతి కుమార్, ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## మండల విద్యాధికారికి ఎస్టీయు ఉపాధ్యాయుల ఘన సన్మానం



**ప్రతి ఘటన,నాగర్ కర్నూల్ బ్యూరో రిపోర్టర్ విజయ్ కాంత్** మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డి. కురుమయ్య ను రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ఎమ్మార్సీ భవనంలో శాలువాలతో శనివారం ఘనంగా సన్మానించారు. జిల్లా పరిషత్ పాఠశాల గుడిపల్లి ప్రధాన ఉపాధ్యాయులు గా ఉన్న కుర్మయ్య రాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖ నాగర్ కర్నూలు మండల విద్యాధికారిగా నియమించింది. ఈ సన్మాన కార్యక్రమంలో ఎస్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.రమేష్ కార్యదర్శి డి.ప్రభాకర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళి అసోసియేట్ ప్రెసిడెంట్ కరుణాకర్, ఎస్. ఈశ్వర్, నరసింహ, నారాయణ, బాలస్వామి, మధుసూదన్ రెడ్డి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ విశ్వాసం నింపారు


**ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య** తెలంగాణ ప్రజలలో భారతీయ జనతా పార్టీ పైన మంత్రి బండి సంజయ్ కుమార్ విశ్వాసం నింపారని బీజేపీ రంగారెడ్డి జిల్లా రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన రాష్ట్ర బీజేపీ కార్యాలయం నాంపల్లిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. కరీంనగర్ లో తెలంగాణ మొదటి మేయర్ ను గెలిపించి, అలాగే భారీ సంఖ్యలో కౌన్సిలర్స్ ను గెలిపించి తెలంగాణ ప్రజలలో బీజేపీ పై విశ్వాసం నింపిన సందర్భంగా మంత్రి బండి సంజయ్ కి శాలువా కప్పి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాబోవు కాలములో తెలంగాణ లోని గ్రేటర్ హైదరాబాద్ , అలాగే ఎంపీటీసీ, జట్పీటీసీ లకు జరిగే ఎన్నికలలో బీజేపీ గెలుపే ధ్యేయం గా ప్రతి కార్యకర్త, నాయకులు సైనికులుగా సమన్వయం తో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో బీజేపీ నాయకులు మాదన్న, నర్సింగ రావ్, జయసూర్య, జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ?



## శాస్త్రీయ పరిజ్ఞానంతోనే సమాజం లో మూఢనమ్మకాలు దూరం

**ప్రిజం పాఠశాల ప్రిన్సిపాల్ టీ.నిరంజన్**

**ప్రతి ఘటన,నాగర్ కర్నూల్ బ్యూరో రిపోర్టర్ విజయ్ కాంత్ :** జిల్లా కేంద్రంలోని ప్రిజం పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించడం జరిగింది.నేటి సమాజంలో మూఢనమ్మకాలను ప్రారదోలుటకు శాస్త్రీయ విజ్ఞానమే తోడ్పాటు అవుతుందని ప్రిజం పాఠశాల ప్రిన్సిపాల్ టి. నిరంజన్ అన్నారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం ప్రీజాం పాఠశాలలో విద్యార్థులలో సృజనాత్మకను వెలికి తీయుటకు వ్యక్తిగతంగా మరియు టీం సభ్యులతో 55 విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.విజ్ఞాన ప్రదర్శనను పాఠశాల విద్యార్థులు క్షుణ్ణంగా పరిశీలించారన్నారు. ఈ కార్యక్రమంలోపాఠశాల డైరెక్టర్ కృష్ణయ్య,వైస్ ప్రిన్సిపాల్ దేవేందర్ ఉపాధ్యాయులు భరత్,వసంత, రాజు,యాదగిరిరావు,సుస్మిత,రామకృష్ణ , సురేష్,పవన్,బలింద్ర నాయక్,సలీం, రామచందర్,పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# గుడిసెలు వేసుకున్న పేదలకు అదే స్థలంలో పట్టాలు ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలి





**భూ కబ్జాలకు పాల్పడిన లేదా ప్రభుత్వం తీసుకోవాలని చూసిన చూస్తూ ఊరుకునేది లేదు**

**తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు రాత్లావత్ శంకర్ నాయక్ డిమాండ్**

**ప్రతిఘటన, ఖమ్మం జిల్లా ప్రతినిధి** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పేదల ఇల్లు కూల్చివేసిన ప్రాంతాన్ని తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు రాత్లావత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో వారి బృందం సందర్శించింది. వెలుగుమట్లలో పేదలు వేసుకున్న గుడిసెలను ప్రభుత్వం తొలగించడంతో గుడిసెవాసుల ప్రాంతాన్ని బృందం పరిశీలించి గుడిసెవాసులను పరామర్శించారు. గుడిసె వాసులందరూ ఆవేదనతో తమ సమస్యలు పరిష్కరించాలని సర్వోదయ మండలి నేతలకు తమ గోడును విన్నవించారు. ఈ సందర్భంగా తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు రాత్లావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ఖమ్మం వెలుగుమట్లలో 28 ఎకరాల భూదాన భూమిలో దాదాపుగా వెయ్యి గుడిసెలు వేసుకున్న పేదల గుడిసెలను ప్రభుత్వం అన్యాయంగా తొలగించడం సరైనది కాదన్నారు. గాంధీజీ వినోబాభావే ఆలోచనలకు విరుద్ధమని భూదాన భూములన్ని కూడా భూమి లేని నిరుపేదలకు దక్కాలని కోరుకున్నారని అందులో భాగంగానే ఖమ్మం వెలుగుమట్లలో భూదాన భూముల్లో గుడిసెలు వేసుకొని ఉన్న పేద ప్రజలకు ప్రభుత్వం వెంటనే అదే స్థలంలో పట్టాలి ఇచ్చి వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భూదాన భూముల హద్దులను గుర్తించి కాపాడి వాటికి భూదాన బోర్డు ఏర్పాటు చేసి అవి పేదలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలు వేసుకున్న స్థలంలోనే పట్టాలు మంజూరు చేయాలని కానీ అలా చేయకుండా కూడు లేని పేదలపై ప్రభుత్వం బుల్డోజర్లతో ఇండ్లను కూల్చడం దుర్మార్గ చర్యగా అభివర్ణించారు. ఇలా చేయడం తగదని పేదల పక్షాన ప్రభుత్వం ఉండాలని లేని యెడల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అందుకు గుడిసె వాసులందరూ సిద్ధంగా ఉండాలని గుడిసెవాసులు ఎవరు అధైర్య పడవద్దు అని భూదాన భూముల్లో ఇండ్లు కోల్పోయిన స్థలంలోనే పట్టాలు వచ్చేంత వరకు, ప్రభుత్వమే ఇండ్లు నిర్మించి ఇచ్చేంత వరకు ఉద్యమించాలని శంకర్ నాయక్ పిలుపునిచ్చారు.

# జే.కే.యం.ఆర్ ఫౌండేషన్ వారి స్కాలర్షిప్ చెక్కులను అందజేసిన శ్రీరాములు అందెల

**ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య** విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి ఆర్థికంగా అండగా నిలుస్తున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి సేవలు అభినందనీయమైనవి అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ అందెల శ్రీరాములు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బడంగ్‌పేట్, బాలాపూర్ డివిజన్‌లలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో 2024--2025 విద్యా సంవత్సరానికి పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ సహకారంతో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బిజెపి అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం బిజెపి కార్యాలయంలో నిర్వహించినటువంటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్షిప్ చెక్కులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం అత్యంత అవసరమని విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి ఆర్థికంగా అండగా నిలుస్తున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి సేవలు అభినందనీయమైనవి అన్నారు. ఈ విధమైన కార్యక్రమాలు విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని పేర్కొన్నారు. అలాగే, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా ప్రతిభావంతులైన విద్యార్థులకు అన్ని విధాలుగా సహకారం అందించేందుకు కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రావుల మల్లేష్ ,బిజెపి సీనియర్ నాయకులు నవారు శ్రీనివాస్ రెడ్డి, రేసు నరసింహారెడ్డి, కొంతం సంపత్ రెడ్డి, బిజెపి ఉపాధ్యక్షులు సైదులు, కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, బిజెపి నాయకులు మల్లేష్, ఆంజనేయులు యాదవ్, బీజేవైఎం నాయకులు సతీష్ నందా, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# మోడీ తప్పుడు విధానాలే అమెరికా సామ్రాజ్యవాదానికి దారులు వేస్తున్నాయి

**ఎస్ వీరయ్య, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు**

**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి బ్యూరో జంగిటి రవీందర్:** కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మోడీ చేస్తున్న తప్పుడు విధానాల వల్ల అమెరికా సామ్రాజ్యవాదం దేశం మీద మరింత పెరుగుతుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు అధ్యక్షతన జరిగిన వర్క్ షాప్ లో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదాని అంబానీ లాంటి సంస్థలకు రాయితీలను కల్పిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను నిరుగార్చుతూ నిరుద్యోగాన్ని పెంచుతూ, రైతాంగాన్ని దివాలా తీస్తూ పరిపాలన సాగిస్తున్నాడని, అమెరికా భారతదేశం మీద అనేక విధాలుగా సుంకాల పేరుతో పన్నులు పెంచుతున్న కనీసం నోరు మెదపకుండా ఉన్నాడని, రష్యా నుండి చమురు కొనుగోలు చేయకూడదని ఆంక్షలు విధిస్తున్న మోడీ ప్రభుత్వం ఎలాంటి ఖండన ఇవ్వకపోవడం విడ్డూరమని వారు అన్నారు. అదేవిధంగా మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో రోజురోజుకు ధరలు పెరుగుతున్నాయి, నిరుద్యోగం పెరిగింది, ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే విధానాలను తీసుకొచ్చి వ్యవసాయ కూలీల పొట్టగొట్టాలని మోడీ ప్రభుత్వం చూస్తుందని దీనికి తోడుగా గ్రామాలలో 125 రోజులు పని కల్పిస్తున్నామని తప్పుడు ప్రచారాలు చేసుకుంటుందని వారు అన్నారు. రానున్న కాలంలో ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే ప్రయత్నం బిజెపి చేస్తుందని, అదేవిధంగా విద్యుత్ సవరణ బిల్లును తీసుకొచ్చి పేదవాడికి విద్యుత్ భారాన్ని మరింత పెంచే విధంగా మోడీ ప్రభుత్వ విధానం ఉందని, పేద మధ్యతరగతి ప్రజలకు ఇవ్వని రాయితీలు పెట్టుబడుదారులకు కాంట్రాక్టర్లకు ఇస్తున్నాడని వారు అన్నారు. గతంలో నల్ల చట్టాలను తీసుకురావడం రైతుల పోరాటంతో రైతాంగానికి మద్దతు ధరను ఇస్తామని చెప్పి నూతనంగా విత్తన చట్టాన్ని తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నాడని దీని ద్వారా వ్యవసాయ రంగం దివాళ తీసే అవకాశాలు ఉన్నాయని వారు అన్నారు. కార్మికుల పొట్టకొట్టే లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మిక వర్గంపై మరింత పని ఒత్తిడిని పెంచాలని బిజెపి చూస్తుందని వారన్నారు. బీహార్ రాష్ట్రంలో ఓట్ల తొలగింపు చేసి అధికారంలోకి రావడం జరిగిందని ఇదే పనిని ఇతర రాష్ట్రాలలో చేయాలనే ప్రయత్నం బిజెపి చేస్తుందని సిబిఐ, ఈడిని తన గుప్పెట్లో ఉంచుకొని రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని తప్పుడు ఆర్థిక విధానాలు అనుసరిస్తూ మతోన్మాదాన్ని పెంచడం లాంటి పనులు బిజెపి చేస్తుందని వారు అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర జాతరలో కుల దురహంకారానికి బలైపోయిన రెండు నెలల పసికందు కుటుంబానికి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సహకారం చేయలేదని దోషులను శిక్షించలేదని వారు గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా తొలగించిన ఇండ్లను వెంటనే నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే పత్తి కొనుగోలు చివరి దశ చేరుకున్న సీసీఐ కేంద్రాల్లో దళారుల వ్యాపారాలు అధికమయ్యాయి తప్ప రైతులకు జరిగిన లాభం ఏమీ లేదని కపాస్ యాప్ తీసుకువచ్చిన రైతులకు జరిగిన మేలు ఏమీ లేదని వారు అన్నారు. అదేవిధంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో యాదాద్రి భువనగిరి జిల్లాకు నిధులు కేటాయింపు విషయంలో అన్యాయం చేసిందని ప్రస్తుతం ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్లో జిల్లా అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. వీరితోపాటు రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జెల్లెల పెంటయ్య బూరుగు కృష్ణారెడ్డి గుంటోజు శ్రీనివాసాచారి జిల్లా కమిటి సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సిర్పంగి స్వామి, దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, బొల్లు యాదగిరి, మద్దెల రాజయ్య, ఎండి పాష, బొడ్డుపల్లి వెంకటేష్ ,గుండు వెంకటనర్సు, గంగదేవి సైదులు, మద్దేపూరం రాజు ,బోలగాని జయరాములు, ఎంఎ ఇక్బాల్, గడ్డం వెంకటేష్ రాగిరు కిష్టయ్య, బల్గూరి అంజయ్య, గోశిక కరుణాకర్, నాయకులు పల్లెర్ల అంజయ్య, ధూపటి వెంకటేష్, ర్యాఖల శ్రీశైలం, పోతరాజు జహంగీర్, లావుడియా రాజు, ఈర్లపల్లి ముత్యాలు, వడ్డేబోయిన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరగాళ్ల పనిపడుతున్న పోలీసులు

**హైదరాబాద్ :** మొన్న ఆపరేషన్ ఆక్టోపస్.. ఇప్పుడు ఆపరేషన్ క్రాక్డౌన్ పేరుతో సైబర్ నేరస్థుల పని పడుతున్నారు తెలంగాణ పోలీసులు. ఇటీవల 16 రాష్ట్రాల్లో భారీ ఆపరేషన్ చేపట్టిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్.. ఇప్పుడు సొంత స్టేట్పై గుర్తిపెట్టింది. మ్యూల్ అకౌంట్స్పై తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసుల ఆపరేషన్ కంటిన్యూ అవుతోంది. ఇటీవల దేశవ్యాప్తంగా ప్యాన్ ఇండియా ఆపరేషన్ నిర్వహించింది తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీస్ వింగ్. ఏకకాలంలో 16 రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించి.. అతిపెద్ద సైబర్ క్రైమ్ ముఠాను పట్టుకున్నారు. ఆక్టోపస్ పేరుతో నిర్వహించిన ఈ ఆపరేషన్లో వందమందికి పైగా సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. ఆక్టోపస్ పేరుతో నిర్వహించిన ఈ ఆపరేషన్లో హైదరాబాద్ కేంద్రంగా మ్యూల్ అకౌంట్స్ బండారం బయటపడింది. నకిలీ వ్యాపార సంస్థల పేర్లతో మ్యూల్ బ్యాంక్ ఖాతాలు తెరిచి సైబర్ మోసాలకు పాల్పడుతున్న వారి గుట్టురట్టైంది. సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. నిందితుల్లో జూబ్లీహిల్స్ మర్కంటైల్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్కు చెందిన బ్రాంచ్ మేనేజర్, సేల్స్ మేనేజర్ కూడా ఉన్నారు. వారితో పాటు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్ తెలిపారు. విచారణలో అసలు సంచలన విషయాలు వెల్లడయ్యాయన్నారు. హైదరాబాద్ పాతబస్తీ పహాడీ షరీఫ్కు చెందిన జవ్వాద్ ఖాద్రీ రిఫాయి, మహమ్మద్ నౌషాద్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలను సమకూర్చేందుకు పథకం పన్నారు. ఇందులో భాగంగా ఒక షట్టర్ను అద్దెకు తీసుకుని, 'స్టార్ అగ్రో ఇండస్ట్రీస్' పేరుతో నకిలీ అద్దె ఒప్పందాలు, తప్పుడు వ్యాపార పత్రాలను



సృష్టించారు. ఈ నకిలీ పత్రాల ఆధారంగా జూబ్లీహిల్స్ మర్కంటైల్ కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సేల్స్ మేనేజర్ పాముల ప్రణవరాజ్, బ్రాంచ్ మేనేజర్ శంకర్ రాథీ సహకారంతో కరెంట్ ఖాతా ప్రారంభించారు. ఖాతా తెరిచిన వెంటనే నకిలీ కంపెనీకి ఏటీఎం కార్డు, చెక్ బుక్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలతో పాటు సిమ్ కార్డును కూడా సైబర్ మోసగాళ్లకు అప్పగించారు. దీంతో పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడ్డట్లు డీసీపీ టి. సాయి మనోహర్ తెలిపారు. దర్యాప్తులో భాగంగా అక్టోబర్ 2025లో ఈ ఖాతా ద్వారా సుమారు రూ. 6.67 లక్షల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. నిందితులు పరారీలో ఉండగా, ఫిబ్రవరి 26, 2026న పక్కా సమాచారంతో వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. సైబర్ క్రైమ్స్ పోలీసు విచారణలో.. సదరు బ్యాంకు శాఖలోనే దాదాపు 30కి పైగా మ్యూల్ ఖాతాలు తెరిచినట్లు నిందితులు అంగీకరించారు. ఈ ముఠా వెనుక ఉన్న ఇతర సభ్యులను, బాధితుల వివరాల కోసం దర్యాప్తు చేస్తామని డీసీపీ చెప్పారు. డబ్బు కోసం బ్యాంక్ ఖాతాలు, కేవైసీ పత్రాలను ఇతరులకు ఇవ్వడం తీవ్రమైన నేరమని పోలీసులు హెచ్చరిస్తున్నారు. బ్యాంకు సిబ్బంది నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు

# కేరళ కోసమే ఖమ్మం కూల్చివేతలు..

**హైదరాబాద్ :** వెయ్యి కోట్ల వేటకు కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను సమిధలుగా మార్చుతున్నదా? కేరళ ఎన్నికలకు మూటల సర్దుబాటు కోసమే ఖమ్మంలో బుల్డోజర్లు కదంతొక్కాయా? ఇద్దరు మంత్రులు గీసిన స్కెచ్కు ముఖ్యనేత మద్దతు ఇచ్చారని, ఫలితంగానే వెలుగుమట్లలోని పేదల ఇండ్లు నేలమట్టమై, వారి జీవితాల్లో చీకట్లు అలుముకున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఖమ్మం పట్టణంలోనే అత్యంత విలువైనవిగా మారిన భూదాన్ భూములపై ఓ మంత్రి కుటుంబానికి చెందిన కన్స్ట్రక్షన్ కంపెనీ కన్నుపడిందని, మరో మంత్రికి చెందిన భూములు కూడా బినామీల పేరుతో సమీపంలోనే ఉన్నట్టు చెప్పుకొంటున్నారు. దీంతో పేదలను తరలిస్తే రూ.35 కోట్లు సర్దుతానని ఒక మంత్రి, ఖాళీచేసిన భూమిని తాను సూచించిన కన్స్ట్రక్షన్ కంపెనీకి అప్పగిస్తామని హామీ ఇస్తే తక్షణమే రూ.100 కోట్లు సర్దుతానని మరో మంత్రి ముఖ్యనేతకు ఆఫర్ ఇచ్చినట్టు చర్చ జరుగుతున్నది. మొత్తంగా రూ.135 కోట్ల ఎరకు పడిపోయిన ముఖ్యనేత రాత్రికి రాత్రే పేదల ఇండ్లపైకి బుల్డోజర్లను పంపినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

**ఇద్దరు మంత్రులు గీసిన స్కెచ్**

ఖమ్మం కొత్త కలెక్టరేట్ కట్టడం, నాగ్పూర్-అమరావతి గ్రీన్ఫీల్డ్ హైవే నిర్మాణంతో రఘునాథపాలెం మండలం వెలుగుమట్ల గ్రామ శివారులోని 147, 148, 149 సర్వే నంబర్లలో ఉన్న 60 ఎకరాల భూ మి ధరకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎకరం రూ.8 కోట్లు పలుకుతుందని అంచనా. ఆ ప్రాంతంలో కలెక్టరేట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేసిన సమయంలోనే ఒక మంత్రి తనతోపాటు తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులతో వెలుగుమట్లలో భూములు కొనుగోలు చేయించినట్టు తెలుస్తున్నది. ఆయన బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ మంత్రిగా పనిచేశారని, అందుకే కలెక్టరేట్ ఎక్కడ కట్టబోతున్నారో ఆయనకు ముందుగానే తెలిసి, పెట్టుబడులు పెట్టించారని అంటున్నారు. దీంతో భూదాన్ భూములకు ఆనుకొని ఇరువైపులా సదరు మంత్రికి, ఆయన అనుచరులకు కలిపి 46 ఎకరాల భూమి ఉన్నట్టు చర్చ జరుగుతున్నది. భూదాన్ భూముల్లో పేదల ఇండ్లు, గుడిసెలు ఉండటంతో ఆయన భూములకు ఆశించిన ధర రావడం లేదని ఆందోళన చెందినట్టు తెలిసింది. మరోవైపు 60 ఎకరాల భూదాన్ భూములపై మరో మంత్రి కుటుంబానికి చెందిన కన్స్ట్రక్షన్ కంపెనీకి కన్నుపడ్డట్టు తెలిసింది. ఆ భూమిలో విల్లాలు కట్టి అమ్మితే రూపాయి పెట్టుబడికి రూ.100 లాభం వస్తుందని అంచనా వేసుకుంటున్నట్టు తెలిసింది. దీంతో ప్రభుత్వ భూమిలో ఉన్న గుడిసెలను తొలగించాలని మంత్రులు అనేకసార్లు ముఖ్యనేత దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. నిరుపేదలను ఖాళీ చేయించాలంటూ ఒక మంత్రి అనుచరులు కోర్టుల్లో కేసులు కూడా వేశారని చెప్తున్నారు.

**ముందుగా రాయబారాలు**

వాస్తవానికి వెలుగుమట్లలో నిరుపేదలు 15 ఏండ్ల నుంచి గుడిసెలు వేసుకొని, శక్తిమేర ఇండ్లు కట్టుకొని నివసిస్తున్నారు. అలాంటి వారిని వెళ్లగొట్టడం అంత సులువు కాదని



మంత్రులు తొలుత గ్రహించినట్టు తెలిసింది. బలప్రయోగం కంటే మంచితనంతోనే ఖాళీ చేయించాలని ప్రణాళికలు వేసినట్టు సమాచారం. ముందుగా వారి అనుచరులను పంపి గుడిసెలు ఖాళీ చేసిన వారికి ఇందిరమ్మ ఇండ్లతోపాటు, రూ.5 లక్షల ఆర్థిక సహకారం అందిస్తామని, ప్రభుత్వంతో చర్చించి మరికొంత సాయం ఇప్పిస్తామని బేరసారాలు నడిపినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే 15 ఏండ్లుగా అక్కడే నివాసం ఉంటున్న కాలనీవాసులు తాము ఖాళీ చేయబోమంటూ తేల్చిచెప్పినట్టు సమాచారం.

**ఒక్క దెబ్బకు రూ.135 కోట్లు**

ఇటీవల కాంగ్రెస్ అధిష్టానం పెద్దలు ముఖ్యనేతతోపాటు ఇతర నేతలను ఢిల్లీకి పిలిచి కేరళ ఎన్నికలకు మూటలు సర్దే బాధ్యతను అప్పగించినట్టు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అందరికీ కలిపి రూ.1,000 కోట్ల భారం మోపారని, ఇందులో ఒక్కో మంత్రికి రూ.35 కోట్లు టార్గెట్ పెట్టారని కాంగ్రెస్ పార్టీలోనే చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ముఖ్యనేత ఇటీవల హైదరాబాద్లో సమావేశమై నిధుల సేకరణపై సహచర నేతలతో చర్చించినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఒక మంత్రి కల్పించుకొని తన వద్ద నగదు లేదని, భూములు ఉన్నా వాటికి విలువ లేదని నిట్టూర్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది. భూదాన్ భూముల నుంచి గుడిసెలు తొలగిస్తే తన భూమికి ధర పలుకుతుందని, అలా చేస్తే రూ.35 కోట్లు సర్దడానికి తనకు అభ్యంతరం లేదని చెప్పినట్టు సమాచారం. ఇదే సమయంలో మరో మంత్రి స్పందిస్తూ.. భూదాన్ భూములను ఖాళీ చేయిస్తే 60 ఎకరాలు ఆధీనంలోకి వస్తాయని, దానిని తన కుటుంబానికి చెందిన ప్రైవేట్ కన్స్ట్రక్షన్ కంపెనీకి అప్పగించాలని, సరే అంటే తక్షణమే రూ.100 కోట్లు సర్దుబాటు చేస్తానని ఆఫర్ ఇచ్చినట్టు తెలిసింది. ఇద్దరు మంత్రులు కలిపి రూ.135 కోట్లు ఇస్తామని చెప్పడంతో ముఖ్యనేత మరో ఆలోచన లేకుండా వారి ప్లాన్కు సరే అన్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఫలితంగానే రాత్రికి రాత్రే పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు పంపినట్టు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

**1,000 కోట్ల కోసమే రేవంత్ అరాచకం**

గాంధీ కుటుంబానికి 1,000 కోట్ల రూపాయలు పంపుతానని ప్రామిస్ చేసిన సీఎం రేవంత్రెడ్డి..అందుకోసం అరాచకపర్వానికి తెరలేపారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. పేదల ఇండ్లను కూల్చి, భూ ములు అమ్మకానికి పెట్టి నగదు సిద్ధం చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇండ్లు కూల్చివేయడంతో శిథిలమై గాజాను తలపిస్తున్న డ్రోన్ చిత్రాన్ని శుక్రవారం ఎక్స్లో పోస్టు చేసి కాంగ్రెస్ సర్కార్ దుర్మార్గాలను కండ్లకు కట్టారు. పేదల ఇండ్లు నేలమట్టం చేస్తున్న సీఎం రేవంత్రెడ్డి..హైదరాబాద్లో రెండో ప్యాలెస్ కట్టుకుంటున్నారని దుయ్యబట్టారు. ఓవైపు బడుగుజీవుల నివాసాలను పెకిలించి వేస్తూ.. మరో వైపు తన కోట గోడలకు తొమ్మిది కోట్లు ఖర్చుచేస్తున్నారని మండిపడ్డారు. 'ఆయన బాటలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మూడో ఇల్లు కట్టుకుంటున్నడు.. మరో కీలక మంత్రి పొంగులేటి పదో కంపెనీ పెట్టి కోట్లకొద్దీ కమీషన్లు దండుకుం టున్నడు..ఇది ప్రభుత్వం కాదు..ఫక్తు రియల్ ఎస్టేట్ కంపెనీ..వీళ్లు పక్కా రియల్ ఎస్టేట్ బ్రోకర్లు' అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సీఎం, మంత్రులు విలాసవంతమైన జీవితాలు గడుపుతూ పేదల బతుకులను రోడ్డుపాలు చేస్తున్నారని మండిపడ్డారు.

# కోరుట్లలో అగ్ని ప్రమాదంలో ఇళ్లు దగ్ధం.. రూ.ఆరు లక్షల ఆస్తి నష్టం

**కోరుట్ల :** కోరుట్ల పట్టణంలోని హాజీపురా కాలనీకి చెందిన రజియొద్దీన్ అనే వ్యక్తి ఇంటిలో శనివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో సుమారు రూ.ఆరు లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. బాధిత కుటుంబసభ్యులు, మెట్పల్లి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ కృష్ణకాంత్ కథనం ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని హాజీపురా కాలనీకి చెందిన రజియొద్దీన్ ఇంటిలో ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన కుటుంబసభ్యులు ఇంటి నుంచి బయటకు పరుగులు తీశారు. మంటలు ఉధృతంగా వ్యాప్తించి కిచెన్, బెడ్ రూమ్ లోని బట్టలు, మంచాలు, కిటీకీలు, దర్వాజలు, ఫ్రిజ్లు, ఏసీలు, ఇతర విలువైన సామగ్రి కాలిబూడిదయ్యాయి. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసేలోపు ఇంటిలోని సామగ్రి కాలిపోయినట్లు రజియొద్దీన్ వాపోయాడు. సుమారు రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం కలిగిందని తెలిపాడు. మెట్పల్లి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి గల కారణాలు, ఆస్తి అంచనా వివరాలను నమోదు చేసుకున్నట్లు ఫైర్ ఆఫీసర్ కృష్ణహరి తెలిపారు.



## వేసవికాలంలో నీటి కష్టాలు రాకుండా ముందస్తుగా బోర్లు వేయించి నీటి సరఫరా చేయిస్తాము



**ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య** ఆకంపల్లి గ్రామంలో వేసవికాలంలో నీటి కష్టాలు రాకుండా ముందస్తుగా బోర్లు వేయించి నీటి సరఫరా చేయిస్తామని సర్పంచ్ జ్యోతి కుమార్ అన్నారు. మహేశ్వరం మండలం ఆకంపల్లి గ్రామంలో మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్ర రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో రాబోయే ఎండా కాలం దృష్టిలో ఉంచుకొని, ఆకనపల్లి సర్పంచ్ జ్యోతి కుమార్ నాయకత్వంలో నూతనంగా మూడు బోర్లు వేయించారు, ఈ సందర్భంగా జ్యోతి కుమార్ మాట్లాడుతూ నాకు ఓటు వేసి గెలిపించిన ప్రజలకు ఎప్పుడు ఎలాంటి కష్టం రాకుండా ఆకంపల్లి గ్రామాన్ని నిరంతరం అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కవిత, వార్డు మెంబర్లు ఎర్ర శ్రీకాంత్, నరసింహ, నేనావత్ రాజు,రేణుక, అశ్విని, జయమ్మ, లలిత, మాజీ సర్పంచ్ ముక్కెర యాదయ్య, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుటికే చంద్రశేఖర్ రెడ్డి, కర్రోల్ల రాజేష్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష

**సిద్దిపేట :** జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులతో పలు అంశాల గురించి పశువుల డాక్టర్ల తో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారుఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూరాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు.కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ మాంసం ఉత్పత్తి పెంచడమే కాకుండా తద్వారా ఉపాధి కోసం ఎదురుచూసే వారికి ఆదాయం పెంపొందించేందుకు రైతులకు గుర్తించాలని తెలిపారు. జిల్లాలో పశు సంపద ను ప్రతి రైతును కలిసి పశు వులకు ఎన్ డి ఎల్ ఎం యాప్ లో ఆధార్ సీడింగ్ ప్రక్రియ రోజు వారిగా ఒక పూర్తి చెయ్యాలని తెలిపారు. 8వ విడత ఎఫ్ఎండి వాక్సినేషన్ మార్చి 2026 లో పూర్తి చెయ్యాలని తెలిపారు.పశు ఔషధ విక్రయ కేంద్రాల ఏర్పాటు, పిఎఫ్ఎంఎస్ ఎఫ్ఎండి వ్యాక్సినేషన్ రెమ్యూనరేషన్ పబ్లిసిటీ ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్, ఇంటిగ్రేటెడ్ శాంపిల్ సర్వే స్కీం, నేషనల్ ఆర్టిఫిషియల్ ఇన్ సేమినేషన్ ప్రోగ్రాం మరియు సెక్స్ స్టోరేజ్ సిమెంట్ ప్రోగ్రామ్స్ లను సైతం పూర్తి చెయ్యాలని ఆదేశించారు.పశు వైద్యశాలలో డాక్టర్లు రైతులకు ఎల్లపుడు అందుబాటులో ఉండాలని పశువులకు మంచి వైద్యం, వ్యాక్సిన్లు వెయ్యాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కొండల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## స్వామిజి అనుమతితోనే ఆశ్రమం తరలింపు ఎంపి చామాల

**గాంధీ భవన్ :** హరీష్ రావుకు,బీజేపీ చీఫ్ రామచందర్ రావుకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లో 150 కోట్ల విలువైన కోకా పెట్ భూములు కేవలం ఒక్క రూపాయికే శారదా పీఠానికి భములు ఇచ్చారు. ప్రాధాన్యత కూడిన ప్రాంతాల్లో నచ్చిన వారికోసం భూములను పేలాల లాగ నాయకులు పంచారు. శారదా పీఠం భూమిని వాళ్ళ అనుమతి తో శంషాబాద్ తరలిస్తున్నారు. శారద పీఠం ఉన్న ఏరియాలో మంజీరా నీళ్ల తో ప్రజలకు మంచినీళ్లు అందించడానికి వాటర్ వర్క్స్ జరుగుతున్నవి. కోర్ అర్బన్ ఏరియాలో మెట్రో, మూసి ని అభివృద్ధి చేయడం ప్రజల కోసమే అని అన్నారు. ఎక్కడ అభివృద్ధి జరగొద్దని హరీష్ రావు కేటిఆర్ లు అడ్డు పడుతున్నారు. బావ, బామ్మర్ది హరీష్ రావు, కేటిఆర్ పొజిషన్ ఏందో తెలియదు. మేము అపొజిషన్ అంటున్నారు. మా ప్రభుత్వానికి కూడా భక్తి ,శ్రద్ధలు ఉన్నాయి. వేములవాడ, సమ్మక్క సారక్క దేవాలయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. రాష్ట్రంలో మంచి జరిగితే మళ్ళీ కాంగ్రెస్ కు పట్టం కడతారని హరీష్ రావు, కేటిఆర్ విష బీజాలు వేస్తున్నారని అన్నారు. మీలాగ కమిషన్ల కోసం కాళేశ్వరం కట్టలేదు. గుజరాత్ లో మోడీ సబర్మతి ని అభివృద్ధి చేసినట్లు తెలంగాణ లో మూసి అభివృద్ధి చేయొద్దా? సబర్మతి కి,మూసి కి సంబంధం లేదు అని రామచందర్ రావు అంటుండు. మూసి కి సబర్మతి కి ఎందుకు సంబంధం లేదని అన్నారు. గాంధీ నగర్ లో ఉన్న నది ఒడ్డున ఎన్ని ఇండ్లు తీశారు. మీరు అక్రమంగా తొలగించి వచ్చు కానీ ఇక్కడ చేయకూడదా? బీఆర్ఎస్ మాట్లాడిన గంట తర్వత బీజేపీ మాట్లాడుతుంది. డిల్లికి పోయి ఒక మాట గల్లీ లో ఒక మాట మాట్లాడితే ఎట్లా అని అయన ప్రశ్నించారు.

## భారీ మోసం కేసులో నిందితురాలు అరెస్టు

**మేడ్చల్ :** ఉప్పల్ పిఎస్ పరిధి రామంతాపూర్ చర్చి కాలనీకి చెందిన మరియమ్మ(50), అమాయక ప్రజలను ఆసరాగా చేసుకొని డబుల్ బెడ్ రూమ్స్, ప్రభుత్వ ప్లాట్లు, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని ఆశచూపి భారీ మోసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసారు. డబుల్ బెడ్ రూమ్స్, ప్రభుత్వ ప్లాట్లు, ప్రభుత్వం ఉద్యోగం ఇప్పిస్తానని మరియమ్మ మాయమాటలు చెప్తూ సుమారు 80మంది వద్ద కోటి ఎనబై లక్షల రూపాయలు వసూలు చేసింది. రామంతాపూర్ చర్చి కాలనీ లో ఉంటున్న మరియమ్మ సమీపంలో ఉన్న చర్చికి వస్తూ వెళ్తూ ఉండేది. 2023 నుండి 2024 వరకు రోజు చర్చికి వస్తున్న మహిళలను టార్గెట్ గా చేసుకొని నా బంధువు కలెక్టర్ అని చెప్తూ, డబుల్ బెడ్ ఇండ్లు, ప్రభుత్వ ప్లాట్లు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని సుమారు 80మంది వద్ద 1.8కోట్ల రూపాయలు కాజేసింది. ఫోన్ పే, క్యాష్ రూపంలో, ఆన్లైన్ రూపంలో డబ్బులు తీసుకుంది మరియమ్మ బాధితులకు ఏదో సాకు చూపుతూ కాలాన్ని గడిపేయడంతో మరియమ్మ మోసాన్ని బాధితులు గుర్తించారు. మరియమ్మ మాయమాటలతో మోసపోయామని బాధితులు ఉప్పల్ పోలీసులను ఆశ్రయించారు. మరియమ్మను ఉప్పల్ పోలీసులు అదుపులో తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నలందా ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ 45 ఏళ్ల వైభవోత్సవ వేడుకలు

**హైదరాబాద్:** నలందా ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ తమ 45వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంది. నాలుగు దశాబ్దాలకుపైగా విద్యా ప్రావీణ్యం, క్రమశిక్షణ మరియు సమగ్ర విద్యార్థి అభివృద్ధికి అంకితభావంతో సేవలందిస్తూ వస్తున్న ఈ సంస్థ, తన విశిష్ట ప్రయాణాన్ని గర్వంగా ఆచరించింది. 1980లో మంతెన సూర్యనారాయణ రాజు ఆధ్వర్యంలో స్థాపించబడిన నాలందా ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్, శాశ్వత గుర్తింపుతో తన విద్యా సేవలను ప్రారంభించింది. విలువల ఆధారిత విద్యను లక్ష్యంగా చేసుకొని ప్రారంభమైన ఈ సంస్థ, నేడు సమాజానికి బాధ్యతాయుతమైన, ప్రతిభావంతులైన పౌరులను తీర్చిదిద్దే ప్రముఖ విద్యాసంస్థగా ఎదిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా భారత విదేశాంగ సేవల మాజీ అధికారి మరియు ప్రముఖ దౌత్యవేత్త దీపక్ వోహ్రా, , ఐక్యరాజ్యసమితితో అనుబంధం కలిగిన గ్లోబల్ వ్యూహకర్త మరియు దౌత్య నాయకురాలు సునీత వర్మ,, భారత సైన్యానికి చెందిన మేజర్ రామ్ విచ్చేసి విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ శ్రీనివాస రాజా మంతెన గామరియు డైరెక్టర్ సూర్య

## బిజినెస్

### మూడో త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి 7.8 శాతం





ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి సంబంధించి దేశ జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదైనట్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కొత్త సిరీస్‌లో జీడీపీ డేటాను విడుదల చేసిన కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ, అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో నమోదైన వృద్ధి గతేడాది కాలంలో నమోదైన 7.4 శాతం కంటే ఎక్కువగానే ఉందని తెలిపింది. గతంలో జీడీపీ డేటాను 2011–12 బేస్ సంవత్సరంతో లెక్కించేవారు, తాజా గణాంకాలు 2022–23 ఆర్థిక సంవత్సరం ఆధారంగా గణిస్తారు. వృద్ధిని పాత వివరాలతో కాకుండా ఇటీవలి ఆర్థిక పరిస్థితులతో పోల్చారు. ఈ కొత్త సిరీస్‌లో జీఎస్?టీ పన్ను రికార్డులు, ఈవాహన్ డేటాతో పాటు ఇంటి పనులు చేసే మనుషుల గురించి, డ్రైవర్ల సేవలను కూడా చేర్చారు. దీనివల్ల ఆర్థిక పరమైన లెక్కలు మరింత ఖచ్చితంగా ఉంటాయని కేంద్రం భావిస్తోంది. ఈ మార్పులు దేశ ఆర్థిక వ్యవస్థ నిజంగా ఎలా పనిచేస్తుందో స్పష్టంగా, మరింత ఖచ్చితంగా తెలిసేందుకు సహాయపడ తాయి. అలాగే, కొత్త సిరీస్ కింద ప్రస్తుత పూర్తి ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ 7.6 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని మంత్రిత్వ శాఖ అంచనా వేసింది.

### కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు.. భారీ నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ




అంతర్జాతీయ పరిస్థితులు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరు స్టాక్ మార్కెట్ల పై తీవ్రంగా చూపింది. ఈ రోజు ఉదయం నుంచి ప్రతికూల వాతావరణం ఎదుర్కొన్న భారతీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ సుమారు 900 పాయింట్లు, నిఫ్టీ 300 పాయింట్ల మేర పతనం కావడానికి ఈ అంతర్జాతీయ పరిణామాలు కారణమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొత్త టారిఫ్ విధింపుల హెచ్చరికలు, అమెరికా–ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇన్వెస్టర్లలో ఆందోళన కలిగించాయి. దీనికి తోడు, ముడి చమురు ధరలు బ్యారెల్కు 72 డాలర్లకు చేరడం, అమెరికా డాలర్ బలపడటం వంటి అంశాలు భారత రూపాయి పై ఒత్తిడి పెంచి, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఈఎఎబ) నిధులను వెనక్కి తీసుకోవడానికి దారితీశాయి. అలాగే ఐటీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వల్ల తలెత్తే అంతరాయాలపై భయాలు ఇన్వెస్టర్లను కలవరపెట్టాయి. ఆంత్రోపిక్ వంటి కంపెనీలు కొత్త ఏఐ టూల్స్ విడుదల చేయడంతో, సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ కోతలపై ఆందోళన మొదలైంది. ఇది కాకుండా, క్యూ3 (ఖ3) జీడీపీ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో దేశీయంగా కూడా కొంత అస్థిరత చోటుచేసుకుంది. బ్యాంకింగ్, ఆటో, ఎఫ్ఎంసీజీ రంగాల్లో భారీగా లాభాల స్వీకరణ జరగడం వల్ల మార్కెట్లు కోలుకోలేకపోయాయి.

# ఇన్వెస్టర్ల హాట్ ఫేవరేట్‌గా మారిన తేజస్ నెట్వర్క్




టాటా గ్రూప్‌కు చెందిన టెలికాం ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థ తేజస్ నెట్‌వర్క్ షేర్లు ప్రస్తుత స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్టర్ల హాట్ ఫేవరెట్‌గా నిలిచాయి. ప్రస్తుతం ఇండియా వేగంగా డిజిటల్ విప్లవం దిశగా అడుగులు వేస్తుండగా.. స్వదేశీ టెక్నాలజీ ఉత్పత్తులకు డిమాండ్ భారీగా పెరిగింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మేక్ ఇన్ ఇండియా', 'పీఎల్ఐ' పథకాల ద్వారా దేశీయంగా టెలికాం పరికరాలను తయారు చేసే కంపెనీలకు విపరీతమైన ప్రోత్సాహం లభిస్తోంది. ఈ నేపథ్యంలో, తేజస్ నెట్‌వర్క్ తన వ్యాపార సామర్థ్యాన్ని మెరుగుపరుచుకుంటూ, భారీ ఆర్డర్లను దక్కించుకోవడంలో సక్సెస్ సాధించింది. ఫలితంగా మార్కెట్ ఒడిదుడుకుల్లో ఉన్నప్పటికీ ఈ షేర్ వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారు. ఈ కంపెనీ షేర్ ధర పెరగడానికి ప్రధాన కారణం 5ఉ నెట్‌వర్క్ విస్తరణ. దేశవ్యాప్తంగా 5ఉ సేవలను వేగవంతం చేసే క్రమంలో బీఎస్ఎన్ఎల్ (ఖాఔఎ) వంటి ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేట్ టెలికాం ఆపరేటర్ల నుండి కూడా తేజస్ నెట్‌వర్క్‌కు భారీ ఆర్డర్లు అందుతున్నాయి. టాటా సన్స్ ఈ కంపెనీలో ప్రధాన వాటాదారుగా ఉండటం వల్ల, మేనేజ్‌మెంట్ పరంగా, ఆర్థికంగా ఈ సంస్థకు గట్టి భరోసా లభిస్తోంది. కేవలం దేశీయ మార్కెట్ మాత్రమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆప్టికల్ నెట్‌వర్కింగ్, వైర్‌లెస్ ఉత్పత్తులకు ఉన్న డిమాండ్‌ను తేజస్ నెట్‌వర్క్ అందిపుచ్చుకుంటోంది. రాబోయే కాలంలో డేటా వినియోగం మరింత పెరగనుండటం, గ్రామ గ్రామానికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలనే లక్ష్యాలు ఈ కంపెనీ వృద్ధికి ఇంధనంలా మారుతున్నాయి. కాగా ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. స్టాక్ మార్కెట్‌లో స్వల్పకాలికంగా ధరల హెచ్చుతగ్గులు సహజమైనప్పటికీ, దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు తేజస్ నెట్‌వర్క్ ఒక మంచి అవకాశం అని చెబుతున్నారు. కంపెనీ యొక్క ఆర్డర్ బుక్ బలంగా ఉండటం, టాటా గ్రూప్ మద్దతు, భవిష్యత్తు టెక్నాలజీపై చేస్తున్న పరిశోధనలు ఈ షేర్‌ను రేసులో ముందుంచుతున్నాయి. టెలికాం రంగంలో చైనా ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించాలనే ప్రపంచ దేశాల నిర్ణయం కూడా తేజస్ నెట్‌వర్క్ వంటి సంస్థలకు అంతర్జాతీయంగా కొత్త ద్వారాలను తెరుస్తోంది.

# బొగ్గు దిగుమతులు 30% తగ్గించుకోండి

బొగ్గు దిగుమతులను కనీసం 30% తగ్గించుకోవాలని విద్యుత్‌ప్లాంట్లకు కేంద్రం సూచించింది. దేశీయ బొగ్గు కలిపి వాడడాన్ని (బ్లెండింగ్) పెంచడం ద్వారా, ఈ ఏడాది కనీసం 15 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతిని నిలువరించవచ్చని భావిస్తోంది. ఈ ప్రణాళికతో దగ్గరి సంబంధాలున్న ప్రభుత్వ, పరిశ్రమ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద థర్మల్ బొగ్గు దిగుమతిదారుగా మనదేశం ఉంది. 2025లో ఇండొనేషియా, దక్షిణాఫ్రికా, రష్యా వంటి దేశాల నుంచి వచ్చిన 50 మిలియన్ టన్నుల బొగ్గును మనదేశంలోని విద్యుత్ ప్లాంట్లు వినియోగించాయి. ఈ ఏడాది 15 మి. టన్నుల మేర బొగ్గు దిగుమతుల్లో కోత వేయాలని కేంద్రం భావిస్తోందని తెలుస్తోంది. దేశంలో నాలుగింట మూడొంతుల విద్యుదుత్పత్తికి బొగ్గుపైనే జరుగుతోంది. దేశీయంగా నాణ్యమైన బొగ్గు లభిస్తున్నందున, ఇబ్బందులేమీ ఉండవని విద్యుత్తు ప్లాంట్లకు ప్రభుత్వం వివరిస్తున్నట్లు సమాచారం. వేసవి కోసం బొగ్గు సరఫరా పెంపు..కోల్ ఇండియా: వేసవిలో విద్యుత్ వాడకం పెరుగుతుంది కాబట్టి, అదనపు విద్యుత్తు ఉత్పత్తి చేసేలా ప్లాంట్లకు బొగ్గు సరఫరా పెంచే పనిలో ఉన్నట్లు కోల్ ఇండియా తెలిపింది. ఈనెల 25 నాటికి కంపెనీ వద్ద 115 మిలియన్ టన్నుల బొగ్గు ఉంది. మార్చి 31 నాటికి ఇది మరింత పెరగనుంది. విద్యుత్ ప్లాంట్ల వద్ద 55 మి. టన్నుల బొగ్గు సహా ఇతరత్రా గూడ్స్ షెడ్లు, వాషరీలు, పోర్టులతో కలిపి మొత్తం 175.5 మి.టన్నుల నిల్వలున్నాయి.



విద్యుత్ ప్లాంట్లకు వేసవి నెల్లో అధిక పరిమాణంలో బొగ్గు అవసరం ఉంటుంది.

# భారత్‌పై సెంచరీల మోత.. మిచెల్‌కు ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డు

న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్‌కు ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. జనవరి 2026 నెలకు గాను 'ఐసీసీ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్'గా మిచెల్ ఎంపికయ్యాడు. గత నెలలో భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో మిచెల్ దుమ్మురేపాడు. కివీస్ జట్టు 2–1తో సిరీస్ గెలవడంలో డారిల్ కీలక పాత్ర పోషించాడు. ఈ మూడు వన్డేల సిరీస్‌లో అతడు ఏకంగా 352 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉండడం గమనార్హం. ఈ అద్భుత ప్రదర్శన ఫలితంగానే అతడికి ఈ ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఇంగ్లండ్ వెటరన్ జో రూట్ వంటి దిగ్గజాలను వెనక్కి నెట్టి ఈ అవార్డును మిచెల్ సొంతం చేసుకున్నాడు. ఇక బంగ్లాదేశ్‌కు చెందిన శోభన మోస్తరీ మహిళల విభాగంలో ఈ అవార్డును దక్కించుకుంది. టీ20 వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్‌లో శోభన అసాధరణ ప్రదర్శన కనబరిచింది. టీ20 వరల్డ్‌కప్–2026కు బంగ్లా క్వాలిఫై కావడంలో ఆమెది కీలక పాత్ర.



## స్పోర్ట్స్

### అతడు అద్భుతాలు చేస్తాడు.. టీమిండియాకు ఎంపిక చేయండి: గంగూలీ



భారత దేశవాళీ క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. జమ్మూ అండ్ కాశ్మీర్ తమ 67 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరిదించుతూ తొలి రంజీ ట్రోఫీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. హుబ్లీ వేదికగా జరిగిన జరిగిన రంజీ ట్రోఫీ 2025–26 ఫైనల్‌లో కర్ణాటకను ఓడించి జమ్మూ కశ్మీర్ ఛాంపియన్‌గా అవతరించింది. ఈ చారిత్రత్మక విజయంలో ఆ జట్టు పేసర్ ఆకిబ్ నబీ ధార్‌ది కీలక పాత్ర. ఈ సీజన్ అసాంతం ఆకిబ్ నబీ అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఈ సీజన్‌లో మొత్తం 60 వికెట్లు పడగొట్టి టాప్ వికెట్ టేకర్ గా నిలిచాడు. రంజీ ట్రోఫీ చరిత్రలో ఒక పేసర్ 60 వికెట్ల మార్కును అందుకోవడం ఇది కేవలం మూడవసారి మాత్రమే. ఫైనల్ మ్యాచ్‌లో కూడా ఆకిబ్ దుమ్మురేపాడు. 29 ఏళ్ల నబీ తన స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. మొత్తంగా 5 వికెట్లు పడగొట్టి కర్ణాటక ఓటమిని శాసించాడు. కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, కరుణ్ నాయర్ వంటి స్టార్ బ్యాటర్లను సైతం నబీ బోల్తా కొట్టించాడు. నబీ తన సంచలన ప్రదర్శనలతో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీని సైతం ఆకర్షించాడు. రాబోయే ఇంగ్లండ్ పర్యటనకు ఆకిబ్ నబీని ఎంపిక చేయాలని గంగూలీ సెలెక్టర్లకు సూచించాడు. ఇంగ్లండ్ పిచ్‌లపై ఆకిబ్ స్వింగ్ బౌలింగ్ భారత్‌కు ఉపయోగపడుతుందని గంగూలీ అభిప్రాయపడ్డాడు. "ప్రయత్నం, దృడ సంకల్పం ఉంటే ఏం చేయగలరో జమ్మూ కశ్మీర్ ప్రపంచానికి చాటి చెప్పింది. జమ్మూ కశ్మీర్ చారిత్రత్మక విజయంతో ఆ ప్రాంతం మొత్తం గర్వించేలా చేశారు. కఠిన పరిస్థితులే ఛాంపియన్‌లను తాయారు చేస్తాయి. ఆకిబ్ నబీ నిజంగా ఒక అద్భుతం. నబీ ఇప్పుడు టీమిండియా జెర్సీ ధరించేందుకు సమయం అసన్నమైంది. ఈ ఏడాది వేసవిలో ఇంగ్లండ్‌తో జరిగే వైట్‌బాల్ సిరీస్‌కు నబీని ఎంపిక చేస్తే బాగుంటుంది" అని ఎక్స్‌లో దాదా రాసుకొచ్చాడు. కాగా బారముల్లాకు చెందిన నబీ.. ఐపీఎల్‌లో కూడా సత్తాచాటేందుకు సిద్ధమయ్యాడు. గత డిసెంబర్‌లో జరిగిన వేలంలో రూ. 8.4 కోట్ల భారీ ధరకు ఆకిబ్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకుంది.

### చరిత్ర సృష్టించిన జమ్మూకశ్మీర్.. తొలిసారి రంజీ ట్రోఫీ కైవసం

హుబ్లీ: జమ్మూకశ్మీర్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. రంజీ ట్రోఫీని మొట్ట మొదటి సారి గెలుచుకున్నది. కర్నాటకతో హుబ్లీలో జరిగిన ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని సాధించిన జమ్మూకశ్మీర్ జట్టుకు రంజీ ట్రోఫీ దక్కింది. ఇవాళ అయిదో రోజు జమ్మూకశ్మీర్ బ్యాటర్లు కర్నాటక బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నారు. జేకే బ్యాటర్లు కమ్రాన్ ఇక్బాల్, సాహిల్ లోత్రాలు.. కర్నాటక బౌలర్లను ఆటాడుకున్నారు. ఆ ఇద్దరూ అయిదో వికెట్ అజేయంగా 197 రన్స్ జోడించారు. కమ్రాన్ ఇక్బాల్ 160 , సాహిల్ లోత్రా 101 రన్స్ చేసి క్రీజ్‌లో ఉన్నారు. రెండో ఇన్సింగ్‌లో ఇవాళ జమ్మూకశ్మీర్ జట్టు 4 వికెట్లు కోల్పోయి 342 రన్స్ చేసిన సమయంలో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. జేకే జట్టు మొత్తం 633 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. అయితే కర్నాటక, జమ్మూకశ్మీర్ కెప్టెన్లు డ్రాకు అంగీకరించడంతో.. రంజీ ట్రోఫీ జేకే జట్టును వరించింది.



ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
ఆదివారం 1
మార్చి 2026




# టాలీవుడ్‌కి డ్రై మంత్‌గా ఫిబ్రవరి.. 10 రిలీజ్‌లు, క్లీన్ హిట్ ఒక్కటీ లేదు!

సంక్రాంతి సీజన్‌లో కళకళలాడిన టాలీవుడ్ బాక్సాఫీస్‌కు ఫిబ్రవరి నెల మాత్రం తీవ్ర నిరాశ మిగిల్చింది. మొత్తం పది సినిమాలు థియేటర్లలోకి వచ్చినప్పటికీ, కమర్షియల్‌గా భారీ లాభాలు తెచ్చిపెట్టిన క్లీన్ హిట్ ఒక్కటి కూడా లేకపోవడం ట్రేడ్ వర్గాలను కలవరపెడుతోంది. ఈ నెలలో రిలీజైన సినిమాల్లో సంతోష్ శోభన్ నటించిన కపుల్ ఫ్రెండ్లీ మాత్రమే ఓ మోస్తరు ఫలితాన్ని సాధించింది. సినిమాకు పాజిటివ్ టాక్ వచ్చినప్పటికీ, ఆ స్థాయిలో భారీ కలెక్షన్స్ రాలేదు. అయినా పెట్టుబడికి తగ్గ రికవరీ సాధించడంతో కమర్షియల్‌గా "సేఫ్ జోన్"లో నిలిచిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే భారీ అంచనాలతో వచ్చిన గుణశేఖర్ తెరకెక్కించిన యూఫోరియా, అలాగే విశ్వక్ సేన్ ఫంకీ చిత్రాలు ప్రేక్షకులను మెప్పించలేక బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. కంటెంట్ పరంగా బలహీనతలు ఈ సినిమాలకు పెద్ద మైనస్ అయ్యాయి. ఇక వరుస సినిమాలతో బిజీగా ఉన్న సుహాస్‌కి హే బల్వంత్ నిరాశే మిగిల్చింది. యావరేజ్ టాక్ కూడా రాకపోవడంతో ఈ సినిమా కూడా ఫెయిల్యూర్ జాబితాలో చేరింది. సరైన కమర్షియల్ సక్సెస్ ఇంకా సుహాస్‌కు అందని ద్రాక్ష పండుగానే మిగిలిపోయిందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఇక మిగతా కొన్ని సినిమాలు ప్రేక్షకులకు రిజిస్టర్ కూడా కాలేదు.. శివ కందుకూరి 'నవాబ్ కేఫ్', సాయి సింహాద్రి 'సన్ ఆఫ్', అలాగే 'సీతా పయనం', 'విత్ లవ్', 'శ్రీ చిదంబరం గారు' లాంటి సినిమాలు కనీస బజ్ లేకుండా రిలీజ్ అయ్యి, అంతే సైలెంట్ గా మొదటి వీకెండ్‌కే థియేటర్ల నుంచి సైలెంట్‌గా తప్పుకున్నాయి. నెలాఖరులో ఫిబ్రవరి 27న రిలీజైన శ్రీ విష్ణు విన్యాసం పైనే ఇప్పుడు ఇండస్ట్రీ ఆశలు పెట్టుకుంది. శ్రీవిష్ణు మార్క్ కామెడీ వర్కౌట్ అవుతుందని భావించినప్పటికీ, ఫస్ట్ డే మిక్స్డ్ టాక్ వచ్చింది. మొదటి రోజు కలెక్షన్స్ ఓ మోస్తరుగా ఉన్నా, అసలు ఫలితం మాత్రం వీకెండ్ వసూళ్లపైనే ఆధారపడి ఉంది. అయితే ఏపీ, తెలంగాణ ప్రేక్షకుల పల్స్ పూర్తిగా మారిపోయిందని ఈ నెల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. సంక్రాంతి లాంటి పెద్ద సీజన్ తర్వాత వచ్చిన రెగ్యులర్ సినిమాల కోసం థియేటర్లకు రావడంలో ప్రేక్షకులు ఆసక్తి చూపడం లేదు. "ఓటీటీలో చూసుకుందాం" అన్న మైండ్‌సెట్ బలపడుతోంది. థియేటర్లలో కలెక్షన్స్ తగ్గిపోవడంతో నైజాం, ఆంధ్రా ప్రాంతాల్లో ఎగ్జిబిటర్లు కూడా నష్టాలు చవిచూశారు. అందుకే వాలెంటైన్స్ వీక్‌లో రామ్ చరణ్ నటించిన ఆరెంజ్, అలాగే ఏ మాయ చేశావే వంటి రీ-రిలీజ్ చిత్రాలపై ఆధారపడాల్సి వచ్చింది. మొత్తానికి, పది సినిమాలు రిలీజ్ అయినా టాలీవుడ్‌కు ఫిబ్రవరి పూర్తిగా డ్రై మంత్‌గా మిగిలిపోయింది. ఇప్పుడు ట్రేడ్ వర్గాల చూపు 'విష్ణు విన్యాసం' వీకెండ్ పెర్ఫార్మెన్స్‌పై, అలాగే వేసవి సెలవులను టార్గెట్ చేస్తూ మార్చి-ఏప్రిల్‌లో రాబోయే భారీ లైనప్‌పైనే ఉంది. సమ్మర్ సీజన్ టాలీవుడ్‌కు ఊపిరి పోస్తుందా? అన్నది చూడాలి.

# శ్రీనిధి శెట్టి బ్యూటిఫుల్ ఫొటోస్

భారతదేశానికి చెందిన సినిమా నటి. ఆమె మొదట మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టి 2015లో మిస్ కర్ణాటక, మిస్ బ్యూటీఫుల్ స్మైల్, 2016లో మిస్ సుప్రనేషనల్ ఇండియా టైటిల్స్‌ను గెలుచుకొని ...అందం, అభినయం ఉన్నా అదృష్టం కలిసి రాని హీరోయిన్లలో కేజీఎఫ్ హీరోయిన్ శ్రీనిధి శెట్టి ఒకరు. నాని తో కలిసి హిట్ 3, సిద్దూ జొన్నలగడ్డ తో తెలుసు కదా వంటి లు చేసినప్పటికీ ఈ ముద్దుగుమ్మకు అవకాశాలు రావడం లేదు.కేజీఎఫ్, కేజీఎఫ్ 2 లతో పాన్ ఇండియా ఫేమస్ అయిపోయింది కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టి. ఇందులో ఆమె అందం, అభినయానికి కుర్రకారు ఫిదా అయిపోయారు.అయితే వీటి తర్వాత శ్రీనిధి నటించిన కోబ్రా పెద్దగా ఆడలేదు. విక్రమ్ హీరోగా తెరకెక్కిన ఈ జస్ట్ యావరేజ్ రిజల్ట్ తో సరిపెట్టుకుంది.అయితే న్యాచురల్ స్టార్ నానితో కలిసి శ్రీనిధి శెట్టి నటించిన హిట్ 3 బ్లాక్ బస్టర్ గా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 100 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది.దీని తర్వాత స్టార్ బాయ్ సిద్దూ జొన్నలగడ్డతో కలిసి తెలుసు కదా అనే లో హీరోయిన్ గా నటించింది శ్రీనిధి శెట్టి.అయితే ఈ కేవలం యావరేజ్ గా మాత్రమే ఆడింది.ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ విక్టరీ వెంకటేష్ నటిస్తోన్న ఆదర్శ కుటుంబం అనే లో హీరోయిన్ గా నటిస్తోంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ ను తెరకెక్కిస్తున్నాడు.సోషల్ మీడియాలో యాక్టివ్ ఉండే శ్రీనిధి శెట్టి లేటెస్ట్ గా కొన్ని బ్యూటిఫుల్ ఫొటోస్ షేర్ చేసింది. ఇందులో చీర కట్టుతో మేకప్ లేకుండా సింపుల్ లుక్‌తో కట్టి పడేసింది



# పవర్‌ఫుల్ పాత్రలో వివేక్ ఒబెరాయ్



ప్రభాస్, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో రూపొందుతున్న పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'స్పిరిట్'. ఈ చిత్రంలో పవర్ ఫుల్ పాత్రతో వివేక్ ఒబెరాయ్ కనిపించబోతున్నట్లు మేకర్స్ తెలిపారు.ఈ నేపథ్యంలో విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌లో ఒబెరాయ్ కమాండింగ్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో, ఇంటెన్స్‌గా కనిపిస్తూ హై-స్టేక్స్ యూనివర్స్‌లో తన పాత్ర ఎంత ప్రభావవంతంగా ఉండబోతుందో చూపించారు. విభిన్న పాత్రలతో తనదైన ముద్ర వేసుకున్న ఆయన రాకతో కథలో కొత్త డైనమిక్ చేరింది.ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో ఐశ్వర్య దేశాయ్‌ను పరిచయం చేశారు మేకర్స్. ఆమె పాత్ర కథలో చాలా కీలకంగా ఉండనుంది. 'యానిమల్' సంచలన విజయం తర్వాత నిర్మాత భూషణ్ కుమార్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మరోసారి బోల్డ్ క్రియేటివ్ విజన్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.ప్రభాస్‌కు జోడిగా తృప్తి డిమ్రి కనిపించనున్నారు. భారీ స్థాయిలో, అద్భుతమైన ఎమోషన్స్‌తో ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ ఇంటెన్స్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించనుంది. 8 భాషల్లో విడుదల కానున్న ఈ పాన్-వరల్డ్ ఎంటర్‌టైనర్‌ను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను సమానంగా ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు. గుల్షన్ కుమార్ సమర్పణలో, టి-సిరీస్ ఫిలిమ్స్, భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# సందీప్‌తో మిరాయ్ బ్యూటీ!

'అశోకవనంలో అర్జున కల్యాణం' మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన రితికా నాయక్.. హాయ్ నాన్న మూవీలో క్లైమాక్స్‌లో ఎంట్రీ ఇచ్చి ఆకట్టుకుంది.ఇక ఆ తర్వాత మిరాయ్‌తో ఒక్కసారిగా క్రేజీ బ్యూటీగా మారిపోయింది. అందం, అభినయంతో కుర్రాళ్లను సైతం ఆకట్టుకుని బిగ్ సక్సెస్ అందుకుంది. ప్రజెంట్ ఈ అమ్మడు వరుస ఆఫర్లు అందుకుంటుంది. ప్రస్తుతం డ్యూయెట్, కొరియన్ కనకరాజు మూవీస్‌లో నటిస్తున్నారు. ఇప్పుడు మరో ఆఫర్ అందుకుంది రితికా. టాలీవుడ్, కోలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులు చేస్తున్న టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్.. ఈ ఏడాది పొలిటికల్ యాక్షన్ డ్రామా 'పవర్ పేట'తో రాబోతున్నాడు. ఈ మూవీలో సందీప్ సరసన 'మిరాయ్' బ్యూటీ రితికా నాయక్ హీరోయిన్‌గా ఫిక్స్ చేసినట్లు టాక్. దీనికి రౌడీ ఫెలో, చల్ మోహన్‌రంగ్ మూవీస్ ఫేం కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తుండగా... 70 ఎంఎం ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ రావాల్సి ఉంది.





# ఈ విజయం గర్వంగా ఉంది

యష్ రాజ్ ఫిలిమ్స్ నిర్మించిన 'మర్దానీ 3' బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. మర్దానీ ఫ్రాంచైజీలో భాగంగా వచ్చిన ఈ మూడో పార్ట్ భారీ కలెక్షన్లను నమోదు చేసింది.మర్దానీ 3 ఇప్పటికే మర్దానీ ఫ్రాంచైజీలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇది ఇండియన్ బాక్సాఫీస్ వద్ద 50 కోట్లు, ప్రపంచవ్యాప్తంగా 75 కోట్లు క్రాస్ చేసి ఓ మైలు రాయిగా రాణి ముఖర్జీ కెరీర్‌లో నిలిచిపోయింది. ఈ మేరకు రాణి ముఖర్జీ తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ .. "మర్దానీ 3'ని ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రేక్షకులకు థాంక్స్. నేను వారికి ఎప్పుడూ కృతజ్ఞురాలిని. 'ఆల్ఫా మేల్' పాత్రలతో తీసిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతున్న ఈ సమయంలో 'మర్దానీ 3' ఇలాంటి విజయాన్ని సాధించడం గర్వంగా ఉంది. ఇలాంటి సమయంలో ఈ విజయం ఇంకా ఫీమేల్ సెంట్రిక్ సినిమాలకు ఆదరణ ఉందనే శక్తివంతమైన విషయాన్ని రుజువు చేస్తుంది. చిత్ర పరిశ్రమ ఈ విషయాన్ని గమనించిందని, అందుకే ఇలాంటి మరిన్ని ఫీమేల్ సెంట్రిక్ సినిమాలు వస్తాయని నేను ఆశిస్తున్నాను' అన్నారు.

PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PVT. LTD. AT M/S SMIL YS ONLINE, H-NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500070 AND PUBLISHED AT VIPLAV MEDIA PVT LTD. H-NO: 18-7-496 KANDIKAL GATE, CHARMINAR, HYDERABAD, TELANGANA - 500053. CEO & CHEIF EDITOR: VANGA NAGARAJU, EDITOR: VANGA VIPLAV. UDYAM- TS-02-0308842 PHONE NO: +919394517067, +918499094183.